Licenced to Post without Prepayment (PMG/VJ/PWPP/17/2009-11)

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు స్థాపితం: 1930 జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి

Longest Living Newspaper in Telugu Journalism

జమీన్‌రైతు

సంపుటి: 82 • సంచిక: 15 • 15-4-2011 శుక్రవారం • పేజీలు: 16 • విడి ప్రతి: రూ.5/-

జమీన్‌రైతు
పాగతోట, నెల్లూరు - 524 001.
ప్రకటనలకు
98489 66163
98489 66165
చందాలకు
98489 66190



కాంగ్రెస్ చెలగాటం, జగన్ ప్రాణ సంకటం!

కడప ఉప ఎన్నిక రోజు రోజుకూ రంగులు మారుతున్నది. చిత్ర విచిత్ర రూపాలు సంతరించుకొంటున్నది. ఒక రకంగా చెప్పాలంటే ఈ ఎన్నిక కాంగ్రెస్ చెలగాటంగా, జగన్‌కు ప్రాణ సంకటంగా మారుతున్నది. ఇందులో గెలిస్తే కాంగ్రెస్‌కు లాభమే తప్ప, ఓడితే కలిగే నష్టం పెద్దగా లేదు. గెలిస్తే, జగన్ చీకాకు శాశ్వతంగా తప్పిపోతుంది. అదే ఓడితే, వైఎస్ సానుభూతి పని చేసిందని చెప్పి సరిపెట్టవచ్చు. కానీ అదే జగన్ విషయానికి వస్తే, గెలిస్తే వచ్చే లాభం తక్కువ. ఏ కారణం వల్లనైనా ఓడితే మాత్రం రాజకీయ భవిష్యత్తు భస్మమై పోతుంది. ఈ కీలకం అర్థం కావడంతో కాంగ్రెస్ నేతలు చెర్లాటలకు దిగుతున్నారు. జగన్ మీద ముప్పేట దాడి చేస్తున్నారు. ఏడుగురు మంత్రులు, యాభై మంది ఎమ్మెల్యేలను కడపలో మోహరిస్తున్నారు. డబ్బులో జగన్‌కు ఏ మాత్రం తీసిపోకుండా చూడడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాడు ముఖ్యమంత్రి. నిజానికి అందరు ముఖ్యమంత్రుల వలె ఆయన దగ్గర డబ్బు మూటలు లేవు. పదవిలోకి వచ్చిన తర్వాత ఆయన ఒక్క లాభసాటి ఫైల్ మీద కూడా సంతకం పెట్టలేదు. భవిష్యత్తులోనైనా పెడతాడన్న నమ్మకం లేదు. అందువల్ల రాజకీయవాదులకు డబ్బు సంచులందించే వర్గాలు ఆయన దరిదాపులకు కూడా రావడం లేదు. ధన అవసరాలన్నిటికీ ఆయన ఢిల్లీ మీద ఆధారపడవలసి వస్తున్నది. వైఎస్ హయాంలో దేశంలో ఎక్కడ ఏ ఎన్నిక జరిగినా ఇక్కడ నుంచి సూట్‌కేసులు తరలి వెళ్లేవి. కానీ ఇప్పుడు అక్కడ నుంచి పంపక తప్పడం లేదు. ఢిల్లీ పెద్దలకు ఇది చిరాకు సమస్యే. కానీ జగన్‌ను అడ్డుకోవాలంటే తమ ఖజానా నుంచి కొంతైనా తరలించక తప్పడం లేదు.

అనుకూలం... వ్యతిరేకం...

ఈ ఉప ఎన్నిక ప్రధానంగా రెండు అంశాల మీద నడుస్తున్నది. మొదటిది – జగన్ అనుకూలం; రెండవది జగన్ ప్రతికూలం. పార్టీలు, సిద్ధాంతాలు లేవు. అటు కాంగ్రెస్, ఇటు తెలుగుదేశం పార్టీలు రెండూ జగన్ వ్యతిరేక ఓట్ల మీదనే ఆధారపడవలసి రాక తప్పడం లేదు. ఒక రకంగా చెప్పాలంటే జగన్‌కు ఇదే పెద్ద అనుకూలత. తన వ్యతిరేక ఓట్లలో వచ్చే చీలిక వల్ల సహజంగానే లాభపడుతున్నాడాయన. మొదట అనుకొన్నది కాంగ్రెస్ ఓట్లలో చీలిక వస్తుంది కాబట్టి, తెలుగుదేశానికి ఏదైనా లాభం వుంటుందేమో అని. కానీ ఇప్పుడు పరిస్థితి చూస్తే ఓటర్లు కాంగ్రెస్, టిడిపి, జగన్ పార్టీల వారీగా కాక జగన్ అనుకూల, ప్రతికూల వర్గాలుగా చీలి పోతున్నారు. దానితో రాజకీయ అంచనాలు, లెక్క పక్కలు తారుమారౌతున్నాయి.

గ్రామ సింహాలకు తిన్నంత మేత

ఈ ఎన్నికలలో అన్ని రాజకీయ పక్షాలూ ఓటర్లకంటే, నేతలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. గ్రామాలలో కానీ, మండలాల స్థాయిలో కానీ ఏ కొద్దిపాటి ఓట్లను సంపాదించి పెట్టగలడన్న నమ్మకం కలిగిస్తే, చాలు పంట పండినట్లే లెక్క. మూడు పార్టీలూ వారి ఇళ్ల ముందు వాలి పోతున్నాయి. ఏ గొంతెమ్మ కోరిక కోరినా తీర్చడానికి సిద్ధపడుతున్నాయి. మూడు నాలుగు వందల ఓట్లు సేకరించగల నాయకుడికి ఐదు లక్షల వరకు ముట్ట చెప్పడానికి సిద్ధపడుతున్నారు అభ్యర్థులు. అదే మూడు నాలుగు గ్రామాలలో పలుకుబడి కల్గిన వారైతే, ముప్పై నలభై లక్షల వరకు వెళ్తున్నది వేలం పాట. కడప జిల్లాలోని చాలా గ్రామాలలో ఇంకా ఫ్యాక్షన్ పెత్తందారీతనం చలామణిలో వుంది. ఏదో ఒక కుటుంబం చెప్పినట్లు ఓట్లు వేసే సంస్కృతి ఆచరణలో వుంది. దాన్ని ఆసరాగా తీసుకొని ఆ గ్రామ నేతలను కొనుగోలు చేస్తే ఆయా గ్రామాలలో తమకు గ్యారంటీగా ఓట్లు పడతాయన్నది అభ్యర్థుల ఆశ. దానితో ఈ గ్రామ సింహాలకు తిన్నంత మేత దొరుకుతున్నది.

జగన్‌కు మిగిలింది ముగ్గురే

ఓదార్పు యాత్ర నాటి నుంచి నిన్న మొన్నటి వరకు కడప జిల్లాకు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలు వైఎస్.జగన్‌కు అండగా నిలబడ్డారు. పార్టీ బహిష్కారానికి కూడా సిద్ధపడి మరీ ఆయన వెంట నడిచారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలలో ఎమ్మెల్యేలను ఆకర్షించడానికి స్వంత జిల్లా పలుకుబడి బాగా ఉపయోగపడింది ఆయనకు. కానీ తీరా ఉప ఎన్నికలకు రంగం సిద్ధమయ్యే సరికి ఆ ఎమ్మెల్యేలు ఒకరొకరుగా జారుకొంటున్నారు. బద్వేల్ ఎమ్మెల్యే కమలమ్మ మొదట బోణీ కొట్టింది. ఆమె రాజకీయంగా అనామకురాలు. జగనే ఆమెను ఎంపిక

కొరవ 14వ పేజీలో

కార్టూన్ స్కేప్



మా ఆవిడకి కొంచెం పొడుపు ఎక్కువేరా! నూనే లేకుండా వంటలెలా చేయాలో నేర్చుకుంటుంది!

మేకపాటి ఇప్పుడేమంటారు?



కడప ఉప ఎన్నికలో డబ్బు గబ్బు ఎంత ఘాటుగా ముక్కుపుటాలు పగుల కొడుతున్నదో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దిబ్బ మీద చెత్త ద్రిమ్మరించినంత సులభంగా, సునాయాసంగా కోట్లాది రూపాయలు క్రుమ్మరిస్తున్నారు. అదేమైనా కష్టపడి సంపాదించినదైతే నొప్పి తగులుతుంది. కాంట్రాక్ట్ పనుల్లోనూ, భూముల స్వాహాలోనూ ప్రజల జేబులు కత్తిరించి దోచుకున్న సొత్తు కాబట్టి, చింత లేకుండా చెత్తతో సమానంగా ధార పోస్తున్నారు రాజకీయవాదులు. ఇక్కడ చెప్పదలచింది అది కాదు. ఈ డబ్బు గబ్బుతో నెల్లూరు జిల్లాకున్న బాదరాయణ సంబంధం ప్రస్తుతం మనకు ఆసక్తి కల్గించే అంశం.

నెల్లూరు, కడప జిల్లాల సరిహద్దులోని బద్వేల్ చెక్‌పోస్టు దగ్గర వరసగా మూడు రోజులు పోలీసులకు పెద్ద ఎత్తున డబ్బు కట్టలు దొరికాయి. కడప జిల్లాలోకి ధన ప్రవాహాన్ని నివారించడానికి ఎన్నికల కమిషన్ చెక్‌పోస్టులలో కార్లు, లారీలు తడిమి చూస్తున్నది. ఈ సోదాలలో పట్టుబడుతున్న సొత్తులో అధిక భాగం నెల్లూరు జిల్లావాసులదే కావడం గమనార్హం. పొదలకూరు బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసిన రెండు మొత్తాలు, మొదట 28 లక్షలు, ఆ తర్వాత 55 లక్షలు, పోలీసులకు పట్టుబడ్డాయి. సత్యనారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి అనే వారిద్దరు ఇంత సొమ్ము తీసుక వెళ్తుండినారు. వీరిద్దరూ, నెల్లూరు ఎమ్పీ మేకపాటి రాజమోహన్ రెడ్డి సంబంధీకులు కావడం గమనార్హం. పొదలకూరు మండలం ప్రభగిరిపట్నంలో మేకపాటి సోదరులకున్న చక్కెర ఫ్యాక్టరీ ఖాతాలో నుంచి ఈ సొమ్ము తీసుకొన్నామని, చెరకు రైతులకు ఇవ్వడం తమ ఉద్దేశమని పోలీసులకు చెప్పారట వారు. నెల్లూరు జిల్లాలో వున్న చెరకు రైతులకు కడప జిల్లాలో చెల్లింపులు చేయడం ఏమిటో చెప్పేవారికి, వినే వారికి కూడా అర్థం కాని విషయం. చక్కెర ఫ్యాక్టరీ ఖాతాలో నుంచి రోజూ డబ్బు డ్రా చేయడం, పోలీసులకు దొరకకుండా తప్పించుకోగల్గితే, నేరుగా కడప ఎన్నికల నిర్వాహకులకు చేరవేయడం, పొరపాటున దొరికితే చెరకు రైతుల పేరు చెప్పడం వీరికి మామూలై పోయిందట.

మేకపాటి రాజమోహన్‌రెడ్డి కాంగ్రెస్‌ను వదలి వైఎస్.జగన్‌ను కౌగిలించుకోవడానికి వెనుక బలీయమైన ఆర్థిక కారణాలున్నాయని గతంలో 'జమీన్‌రైతు' ఒక వార్త వ్రాస్తే, చాలా కోపం వచ్చిందాయనకు. జగన్‌కు తనకు మధ్య మనం వూహించలేని మొత్తాలలో ధన లావాదేవీలున్నాయన్న వాదనను తీవ్రంగా ఖండించారాయన. ఆ వార్త, ఆ వాదన ఏ మాత్రం అసత్యం కాదని చెప్పడానికి ప్రభగిరిపట్నం చెరకు ఫ్యాక్టరీ నుంచి కడప జిల్లాకు తరలి వెళ్తున్న ఈ డబ్బు మూటల ప్రవాహం ఒక నిదర్శనం కాదని ఇప్పుడు చెప్పగలడా, రాజమోహన్‌రెడ్డి గారు?

సరికొత్త అధ్యాయం!

అన్నా హజారే నిరాహార వ్రతం దేశ రాజకీయాలలో ఒక కొత్త అధ్యయానికి శ్రీకారం చుట్టింది. ప్రజలు ఏ అంశంపై మాట్లాడుకోవాలో నిర్ణయించే అధికారాన్ని రాజకీయ నేతల నుంచి తప్పించిన పరిణామం ఇది. నెల క్రితం అన్నా హజారే ఎవరో ఈ దేశంలో ఎవరికీ తెలియదు. కానీ ఈ రోజు ఆయన పార్లమెంట్ ఏ చట్టం చేయాలో, ప్రభుత్వం ఎట్లా ప్రవర్తించాలో నిర్దేశించే స్థాయికి ఎదిగాడు. మరొకప్రక్క ప్రతిపక్షం పాత్రను కూడా తన పరం చేసుకొన్నాడు. 2జి స్పెక్ట్రం కుంభకోణంపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు కోసం దేశంలోని ప్రతిపక్షాలన్నీ కలిసి రెండు నెలలపాటు పార్లమెంటును స్తంభింప చేయవలసి వచ్చింది. కానీ 60 ఏళ్ల రాజకీయ అవినీతి పోకడలకు అడ్డుకట్ట వేయడానికి మూడంటే మూడు రోజుల నిరాహార వ్రతం సరిపోయింది అన్నా హజారేకు.

అయితే ఇల్లలకగానే పండుగ కానట్లు, జన్ లోక్‌పాల్ బిల్లు తయారీకి కేంద్ర ప్రభుత్వం అంగీకరించినంత మాత్రాన దేశంలో అవినీతి సమస్తం మాయమై పోతుందని కల కనలేము. మన రాజకీయవాదులు అంత తేలికగా తమ ఆధిపత్యాన్ని వదులుకోవడానికి సిద్ధంగా వుండరు. రేపు చట్ట సభలో ఈ బిల్లు చర్చకు వచ్చినప్పుడు, బిల్లుతో ప్రజలకు కలిగే మేలు కంటే, దానికోసం ఒత్తిడి చేసిన అన్నా హజారే నైతిక వర్తన మీదనే అధికంగా మాట్లాడబోతారు మన పార్లమెంట్ సభ్యులు. ఇప్పటికే కపిల్ సిబాల్ వంటి రాజకీయవాదులు దీన్నొక బ్లాక్ మెయిల్ వ్యవహారంగా అభివర్ణిస్తున్నారు. రేపు ఇదే కారణం చూపి జన్ లోక్‌పాల్ బిల్లును అటకెక్కించడానికి అటు పాలక పక్షం ఇటు ప్రతిపక్షం కూడా కుటిల ప్రయత్నం చేయడం ఖాయం. మన దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు అవినీతి మకిలి అంటించుకొన్నవే. అవినీతి పునాదుల మీద తమ రాజకీయ సౌధాలను నిర్మించుకొన్నవే. పోలీసు యంత్రాంగాన్ని, సిబిఐ వంటి వ్యవస్థలను రాజకీయ పార్టీలు ఎంతో కాలంగా తమ అవసరాలకు వాడుకొంటున్నాయి. తమ పరిధిలో లేని, తమ మాట వినని వున్నత సంస్థ ఒకటి తమ నెత్తిన కూర్చొనే పరిస్థితిని ఏ రాజకీయ పార్టీ కూడా అంగీకరిస్తుందని ఆశించలేము. హజారే కోరిన లోక్‌పాల్ బిల్లును అడ్డుకోవడానికి వీరందరూ కలిసి సకల ప్రయత్నాలూ చేస్తారు.

హజారే ఉద్యమం రాజకీయవాదులను రెండు రకాలుగా భయపెడుతున్నది. మొదటిది, ఎన్నో ఏళ్లుగా తినమరిగిన పందికొక్కులు తమ భుక్తికి ప్రమాదం వస్తుందని భావించడం. రెండవది, సామాజిక ఉద్యమాల ద్వారా ప్రభుత్వ విధానాలను ప్రభావితం చేసే పరిస్థితి తలెత్తడం. శాసనాలు చట్టాలు చేసే అధికారం తమ తాతల ఆస్తిగా భ్రమపడే రాజకీయ శక్తులు ఈ మార్పును అంత సులభంగా అంగీకరిస్తాయనుకోవడం పొరపాటు.

అరవై ఏళ్లుగా దేశ ఆర్థిక వ్యవస్థ మూలుగులను పటిక బెల్లం వలె చప్పరిస్తున్న అవినీతి చెదపురుగును నిర్మూలించడంలో ఇప్పుడు హజారే సాధించిన విజయం చాలా చిన్న ముందడుగు మాత్రమే. దాని ద్వారా ఆయన నెరవేర్చిన సత్కార్యం, ప్రజలు తమ అభిప్రాయాలను ఎంతో బలంగా ప్రభుత్వానికి అర్థమయ్యేట్లు చెప్పగలగడం మాత్రమే. కంప్యూటర్ నేర్చిన యువతరం, వ్యవస్థ పతనం పట్ల ఆవేదన చెందడం తప్ప ఏమీ చేయలేని సగటు ప్రజానీకం ఒక్కటై అన్నా హజారేకు అండగా నిలబడడం వల్లనే ఆయన ఒక్క రోజులో మహాత్మాగాంధీతో పోలిక పెట్టే స్థాయికి ఎదిగిపోయాడు. అంత మాత్రాన ఆయన గాంధీతో సమానుడై పోడు... గాంధీ ప్రబోధించిన ఉద్యమ మార్గం ఎంత ప్రభలమైనదో ప్రజలకు గుర్తు చేసిన వాడిగా మాత్రమే అన్నా హజారేను చూడాలి మనం. లోక్‌పాల్ బిల్లును ప్రభుత్వ హామీ స్థాయి నుంచి చట్ట రూపం ధరించే వరకు తీసుక వెళ్లడానికి హజారే ఎంతో పోరాటం చేయవలసి వుంటుంది. అదంత సులభ సాధ్యమైన పని కాదు. తన వ్యక్తిత్వంపైన, చిత్తశుద్ధి పైన, పోరాట మార్గంపైన రాజకీయవాదులు ఎన్నో రకాల నిందలు క్రుమ్మరించడం ఖాయం. వాటికి బెదరి పోకుండా వ్యవస్థ మార్పులు కోరుకొంటున్న దేశ ప్రజానీకాన్ని ముందుకు నడిపించడానికి అన్నా హజారే ఎంతో సంయమనంతో ముందుకు సాగవలసి వుంటుంది. భగవంతుడు ఆయనకు ఆ నిగ్రహశక్తిని, నిబ్బరాన్ని కలుగ చేయాలని కోరుకొంటున్నాము. అన్నా హజారే వంటి సామాజిక సేవకుల అవసరం దేశానికి ఎంతగానో వుంది. ఆయన్ను జాగ్రత్తగా కాపాడుకోవడం దేశం ప్రజలందరి విధి.

జమీన్‌రైతు

జనవాణి

మరో గాంధీ అన్నా హజారే!

దేశం చాలా క్లిష్ట పరిస్థితులలో వుంది. అవినీతి భూతం పెట్రేగి పోతుంది. ఇటువంటి పరిస్థితులలో దేశంలోని అన్ని స్థాయిలలో వుండే అవినీతిని అడ్డుకొనే జన లోక్‌పాల్ బిల్లును ప్రవేశపెట్టాలని అతి సామాన్యుడు అన్నా హజారే చేసిన నాలుగు రోజుల నిరాహార దీక్షకు అనూహ్య స్పందన లభించింది. అవినీతి, అక్రమార్జనలపై విసిగి వేసారిన పౌరులు, యువజనులు, మహిళలు, మేధావులు ఒక్కసారిగా వీధుల్లోకి వచ్చి ఉద్యమ పథాన నడవడంతో కేంద్ర ప్రభుత్వం దిగి వచ్చింది. లోక్‌పాల్ బిల్లు తేవడానికి అభ్యంతరమేమీ లేదని ప్రకటించింది. జాతిపిత మహాత్మాగాంధీ చూపిన అహింసా సిద్ధాంతం వజ్రాయుధం వంటిదని మరోసారి లోకానికి చాటి చెప్పిన అభినవ గాంధీ అన్నా హజారేకి అభినందనలు.

వాస్తు రామచంద్ర నెల్లూరు

సంయమనం పాటించండి!

నెల్లూరు రాజకీయాలు వేడెక్కాయి. ఆనం, మేకపాటి సోదరులు ఒకరి నొకరు తీవ్రస్థాయిలో దూషించుకొంటున్నారు. సవాళ్లు విసురుకొంటున్నారు. ఈ వ్యవహారాలు ఎంతవరకు పోతాయోనన్న అనుమానం అందరిలో కలుగుతుంది. ప్రజాస్వామ్యంలో ప్రజాక్షేత్రాన్ని మించిన తీర్పు మరొకటి లేదు. సోదరులు నలుగురు సత్తాను చాటాలనుకొంటే పదవులకు రాజీనామా చేసి మళ్లీ పోటీ చేసి గెలవడం, లేదా సంయమనం పాటించడం ఉత్తమం.

పి.అరుణకుమారి నెల్లూరు

జగన్‌కు తిరుగులేదు!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, యువ నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ఎక్కడ పర్యటించినా జనం నీరాజనాలు పలుకుతున్నారు. దీనికి మంచి ఉదాహరణ ఆయన విజయనగరంలో జరిపిన ఓదార్పుయాత్ర. జగన్ కడప పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలవడం ఖాయం. జగన్‌ను దూరం చేసుకొన్నందుకు కాంగ్రెస్ అధిష్టానం పశ్చాత్తాపపడే రోజు ఎంతో దూరంలో లేదు. స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు అమలు చేసే సత్తా ఒక్క జగన్మోహన్ రెడ్డికే వుంది.

బి.శాలి కావలి

ఆశ వర్కర్లపై విరిగిన లాఠీ!

విజయనగరంలో ఆశ వర్కర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ధర్నా చేస్తుండగా దాన్ని అడ్డుకొన్న పోలీసులను టీవీలో చూచిన తర్వాత – ఆడవారిని స్పెషల్‌గా చూడమని వారు యేమిచేసినా, ఎంత నోరు పారేసుకొన్నా శాంతంగా భరించమని మహిళా సంఘాలు కోరుతున్నాయి. మహిళలను ఎక్కు

కొరవ 14వ పేజీలో

70 ఏళ్ల క్రితం ఈవారం

18-4-1941
పేజీలు : 12 వెల: అణా

నెల్లూరు మున్సిపల్ రేట్ పేయర్ల సంఘం

తే 5-4-41దిన ఏర్పాటైన పై సంఘానికి తాత్కాలిక అధ్యక్షులు విస్సా రాజగోపాలరావు, కార్యదర్శులు ముత్తరాజు వెంకట్రావు, కరువది నారాయణ రావు గార్లు.

తిరుపతి ఎస్టేటు

దేవాలయ కమిటీ వారు గత 11వ తేది కూడా తిరుపతి ఎస్టేటును ప్రభుత్వమునకివ్వ తీర్మానించి నటుల తెలియుచున్నది. వివరములు పూర్తిగా తెలియకపోయినా ఖర్చులు పోను నికరాదాయంతో నూటికి 70రూపాయలు దేవాలయ కమిటీకి ఇచ్చునట్లును, 30రూపాయలు పరిపాలన చేసినందుకు ప్రభుత్వం తీసుకొనునట్లును, రైతువారీ సిద్ధాంతాలు ప్రవేశ పెట్టు వరకు ప్రస్తుత విధానం ప్రకారమే తీర్వలు వసూలు చేయునట్లుగా ఇరువురు అంగీకరించారని తెలుస్తున్నది.

అన్నం తినకపోతే కేసు

బళ్లారి సెంట్రల్ జైల్లో ఆర్గురు సత్యాగ్రహం ఖైదీలపైన అన్నం తినకుండా నిరాకరించినందుకుగాను జైళ్ల చట్టం 52 సెక్షన్ ప్రకారం మోపబడిన కేసు ఏప్రిల్ 11న విచారణకు వచ్చింది. ముద్దాయిల పేర్లు శ్రీయుతులు 1.ఇస్కారామయ్య (గూడూరు), 2.పి.సుబ్బన్న, 3.రామప్ప, 4.ఎం.వెంకట రమణప్ప, 5.సిహెచ్ఎన్ రాఘవరెడ్డి, 6.పి.వెంకటరత్నం గార్లు.

నెల్లూరు ముచ్చట్లు
9 మాసాల జీతము?

వెంకటగిరి వారి మనుబోలు ఆఫీసు గుమస్తా ఒకాయనకు తొమ్మిది మాసాల జీతము బాకీయట. ఏం కొత్త పేష్కారుగారూ, ఏమంటారు?

50 ఏళ్ల క్రితం ఈవారం

14-4-1961
పేజీలు: 12 వెల: 0-20 న.పై

సరిహద్దు గాంధీ అరెస్ట్

సరిహద్దు గాంధీ ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్‌ను ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలను రెచ్చగొడుతున్నాడని ఆరోపించి, పశ్చిమ పాకిస్తాన్ ప్రభుత్వం అరెస్ట్ జేసింది. అయూబ్‌ఖాన్‌ను సైనిక ప్రభుత్వం 1958 అక్టోబరులో అరెస్టుజేసి, వృద్ధాప్యం, అనారోగ్యం కారణాల వల్ల 1959 ఏప్రెల్ నెలలో విడుదల జేసింది. మిలటరీ ట్రిబ్యునల్ ఆరేండ్లపాటు గఫార్‌ఖాన్ ప్రజాహిత కార్యక్రమాలలో పాల్గొనరాదని నిషేధించింది.

71 ఏండ్ల వృద్ధ పఠాన్ నాయకుడు, భారత స్వాతంత్ర్య యోధుడు అయిన గఫార్‌ఖాన్‌కు కారాగార వాస క్లేశమును కల్గించిన పాకిస్తాన్ ప్రభుత్వ చర్య గర్హనీయం.

నెల్లూరు జిల్లాకు మూడు క్రొత్త బ్లాకులు

రాష్ట్రంలో ఏప్రెల్ ప్రారంభం నుండి 26 ప్రీ ఎక్స్‌టెన్షన్ బ్లాకులు ప్రారంభించబడినవి. అందులో నెల్లూరుజిల్లాలో వరికుంటపాడు(ఉదయగిరి తాలూకాలోనిది), సూళ్లూరుపేట, బుచ్చిరెడ్డిపాళెం – మూడు సరికొత్త బ్లాకులు మంజూరైనవి. ఈ బ్లాకులు ఒక ఏడాదిపాటు, పరిశీలనార్థం, బిడిఓల యాజమాన్యాన వుంటవి. అటుపిమ్మట పంచాయితీ సమితులుగా మార్చబడుతాయి.

సర్కిల్ ఇన్స్‌పెక్టరు బదిలీ

నెల్లూరు టౌన్ సర్కిల్ ఇన్స్‌పెక్టరు టి.శ్రీనివాసులునాయుడు కోవూరుకు మార్చబడి, వారి స్థానంలో బళ్లారి మండలీయుడు, హైదరాబాదు పోలీస్ అసిస్టెంటు కమిషనరు హనుమంతరావు నాయుడు గారి సోదరుడు, సీనియర్ సర్కిల్ ఇన్స్‌పెక్టరు అయిన సూర్యనారాయణరావు నాయుడు నియమింపబడినట్లు తెలుస్తున్నది. వీరు 19వ తేది ఛార్జి తీసుకొంటారట.

నెల్లూరు ముచ్చట్లు

వక్ఫ్‌బోర్డు కోర్టు జడ్జిగా నెల్లూరీయుడు!

హైదరాబాద్‌లోని వక్ఫ్‌బోర్డు ట్రిబ్యునల్ కోర్టు జడ్జిగా ఎస్ఎం రఫీ నియమితులయ్యారు. గతంలో ఈయన కరీనంగర్ జిల్లా జడ్జిగా పనిచేసేవారు. రఫీ నెల్లూరు నగరంలోని గర్సివీధి వాసి. ఈయన తండ్రి అమీర్‌సాహెబ్ నెల్లూరు ఎసి కూరగాయల మార్కెట్ అధ్యక్షునిగా చాలాకాలంగా పనిచేశారు. న్యాయ మూర్తిగా అంచెలంచెలుగా ఎదుగుతున్న రఫీ భవిష్యత్తులో హైకోర్టు జడ్జిగా అయ్యే అవకాశాలు ఎక్కువగా వున్నాయి. రఫీకి మా అభినందనలు.

మంత్రి చండీయాగం

రాష్ట్ర ఆర్థిక మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి 11, 12 తేదీల్లో నెల్లూరు లోని తన స్వగృహంలో కుటుంబసభ్య లతో కలసి చండీయాగం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను కలసిన మీడి యాతో సర్వజనుల క్షేమాన్ని ఆకాంక్షించి ఈ చండీయాగం చేసినట్లు చెప్పారు.

శిక్షణకు కలెక్టర్

జిల్లా కలెక్టర్ రాంగోపాల్ ప్రత్యేక శిక్షణకు ముస్సోరి బయలుదేరి వెళ్తు న్నారు. ఈ శిక్షణ ఎనిమిది నెలల పాటుం టుంది. జిల్లాకు కొత్త కలెక్టర్ వచ్చే వరకు జాయింట్ కలెక్టర్ సొరభ్‌గౌర్ ఈ బాధ్యతలు నిర్వహిస్తారు.

తుగ్లక్‌ను తలపిస్తున్న విద్యుత్ ఎస్ఇ!

నెల్లూరు ట్రాన్స్‌కో ఎస్ఇ నిర్ణ యాలు తుగ్లక్‌ను తలపింపజేస్తున్నాయి. గత మాసం రోజుల్లో మూడుసార్లు విద్యుత్ కోత వేళలు మార్చారాయన. తొలుత ఉదయం పది గంటల నుంచి 12 గంటల వరకు వున్న విద్యుత్ కోత వేళలను 12 గంటల నుంచి 2 గంటలకు మార్చారాయన. ఇప్పుడేమో ఉదయం తొమ్మిది నుంచి పది గంటల వరకు, మళ్లీ మధ్యాహ్నం ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు విద్యుత్‌కోత వేళలను మారుస్తున్నట్లు ఎస్ఇ నందకుమార్ ప్రక టించడం విమర్శల పాలవుతున్నది. ఎస్ఇ గారిలో ఈ చపల చిత్తం ఏమిటో అర్థం కావడం లేదు.

జిల్లా అధికారుల బదలీ!

జిల్లా రెవిన్యూ అధికారిగా పని చేస్తున్న జయరామయ్య జడ్పీ సిఇఓగా, నీటి యాజమాన్య సంస్థ పి.డి బి.రామి రెడ్డి జిల్లా రెవిన్యూ అధికారిగా కుర్చీలు మారనున్నారు. జిల్లా సహకారాధికారి ఆనందబాబు నీటి యాజమాన్య సంస్థ పిడిగా బాధ్యతలు స్వీకరించాల్సి వుంది.

డిఎస్పీకి పొగబెట్టిందెవరు?

నెల్లూరు నగర డిఎస్పీ రాధిక అను భవరాహిత్యం వల్ల చేతులారా సమస్యల్లో కూరకపోతున్నారు. నగరంలో ట్రాఫిక్, దొంగతనాలను ఆమె అరికట్టలేక పోతు న్నారన్న సాకుతో ఎస్పీ దామోదర్ రెండు సార్లు మందలించడంతో ఆమె లోలోన బాధపడినట్లు తెలిసింది. ఎస్పీ ఆమె పని తీరుపై ఉన్నతాధికారులకు రహస్యంగా నివేదిక పంపడం, ఓ దొంగతనం వ్యవ హారమై జరిగిన బంగారు రికవరీలో డిఎస్పీని నిందితురాలిగా చూపించే యత్నం చేయడంతో బాగా నొచ్చుకొన్న ఆమె ఎఎస్పీకి సెలవు చీటి ఇచ్చి వెళ్లారు. ఈ సెలవు వ్యవహారాన్ని సైతం ఎస్పీ తనకు తెలియకుండానే వివాదాస్పదం చేయడంతో ఆ శాఖలో గందరగోళం నెల కొంది. డిఎస్పీ తిరిగి డ్యూటీలో చేరినా ఆమెకు స్వాంతన చేకూరే పరిస్థితులు ప్రస్తుతం కాన రావడం లేదు. అయితే తనకు డిఎస్పీకి ఎటువంటి విభేదాలు లేవని ఎస్పీ ఉగాది రోజు మీడియాతో బహిరంగంగానే చెప్పడం విశేషం.

మరీ ఇంత నిర్లక్ష్యమా?

పదవ తరగతి పరీక్ష పేపర్లు దిద్దే నెల్లూరు రంగనాయకుల పేటలోని సెయింట్ పీటర్ హైస్కూల్‌లో డిఇఓ కనీస వసతులు ఏర్పాటు చేయక పోవ డం విమర్శల పాలయ్యింది. 1800 మంది ఉపాధ్యాయులు రోజుకు 72వేల మంది విద్యార్థులు ఆన్సర్ షీట్లు దిద్దే చోట కూర్చొనేందుకు బల్లలు కూడా ఏర్పాటు చేయకుంటే ఎట్లా? అరకొర వసతుల నడుమ ఎట్లాబడితే అట్లా పేపర్లు దిద్దితే వేల మంది పిల్లల భవి ష్యత్తు మాటేమిటి బాలకాశయ్య గారు?

జైన్‌గోల్డ్‌లో అక్షయ తృతీయ సెలబ్రేషన్స్!



నెల్లూరు జిల్లా పరిషత్ ఆఫీసు సెంటర్‌లోని జైన్‌గోల్డ్ జ్యూయల్ జంక్షన్ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, కొనుగోలుదారులకు ఏడు వారాలపాటు ప్రత్యేక బహుమతులిచ్చే అక్షయ తృతీయ సెలబ్రేషన్స్ ప్రారంభమ య్యాయి. వీటిని 11వ తేది రత్నం విద్యా సంస్థల ఛైర్మన్ కెవి రత్నం, ఆయన సతీమణి పద్మావతమ్మ 11వ తేది జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఇక నుంచి వారం వారం ఇక్కడ పదివేల రూపాయల విలువచేసే బంగారు నగలు కొనుగోలు చేసిన ఖాతాదారుల పేర్లు లక్కీడిప్ ద్వారా తీసి టివిఎస్ స్కూటీ పెప్, రెండు డైమండ్ ఉంగరాలను బహుమతిగా ఇస్తారు. నగరంలో 1967లో శంకర్‌లాల్‌జైన్ ప్రారంభించిన జైన్ సిల్వర్ ప్యాలెస్ నమ్మిక, నాణ్యతల ఆధారంగా జనాభిమానం పొందింది. తండ్రికి తగ్గట్లు కుమారులు మణిలాల్ జైన్, నరేంద్రజైన్ సిల్వర్ ప్యాలె స్‌ను దొరకని బంగారు, వజ్రాల నగలు లేవనే కీర్తిప్రతిష్టలు తెచ్చారు. దక్షిణాంధ్ర లోనే కొత్త బంగారులోకమైన అతి పెద్ద గోల్డ్ అండ్ డైమండ్ జ్యూయలరీ షో రూంగా ఖ్యాతితో వెలుగొందుతూ నెల్లూరు కీర్తి ప్రతిష్టలు జైన్‌గోల్డ్ కూడా పెంచు తుందనడం అతిశయోక్తి కాదు.

గ్యాస్ కనెక్షన్‌పై రభస

పొదుపు గ్రూపు సభ్యులకు దీపం పథకం క్రింద ఇచ్చిన గ్యాస్ కనెక్షన్లు అధికార పార్టీ నేతల అనుచరులకు కట్ట బెట్టడాన్ని నిరసిస్తూ ఐద్వా మహిళలు 11వ తేది కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. కమిషనర్ ఆంజనేయు లును ఈ వ్యవహారమై నిలదీశారు. మహి ళల దెబ్బకు కమిషనర్ దిగివచ్చారు. ఈ వ్యవహారంలో అవకతవకలు జరగడంతో 400 మందికే సిలిండర్లు పంపిణీ చేశా మని, మిగతా వాటి విషయమై విచా రణ జరిపి అర్హులకే వీటిని ఇస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నా విర మించారు.

పెద్ద కుంభకోణం


నెల్లూరులో 2జి స్పెక్ట్రం కుంభ కోణంను మించిన భూ కుంభకోణం జరి

కొరవ 14వ పేజీలో









జడ్పీ భవనం చుట్టూ రాజకీయం

అందుకే హడావుడి ప్రారంభోత్సవం



జడ్పీ ఆఫీసును ప్రారంభిస్తున్న ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి.

జిల్లా పరిషత్ నూతన కార్యాలయ భవనం జిల్లా రాజకీయాలకు కేంద్ర బిందువు అయ్యింది. ఈ భవనం చుట్టూ రాజకీయాలు పరిభ్రమిస్తుండడం విశేషం. టిబి హాస్పిటల్ ప్రాంగణంలో నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించిన నాటి నుంచి రాజకీయ వైషమ్యాలు పొడచూపుతూనే వున్నాయి. కాంగ్రెస్ పార్టీలో జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఆనం సోదరులు రెండు వర్గాలుగా విడిపోవడం, అనంతరం కాకాణి జగన్ పార్టీ వైపు వెళ్లడంతో దాని ప్రభావం భవన నిర్మాణంపై పడింది. తన పదవీ కాలంలోగా భవన నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రారంభోత్సవం జరపాలని కాకాణి, దీనిని ఎలాగైనా అడ్డుకోవాలని ఆనం సోదరులు ఎత్తులు పైఎత్తులతో రాజకీయం రంజుగా మారింది. అధికారాన్ని అడ్డం పెట్టుకొని జిల్లా పరిషత్ భవన నిర్మాణాన్ని నిలిపేసేందుకు మంత్రి, ఎమ్మెల్యేలు ప్రయత్నించడం, ఎసిబి అధికారులతో దాడులు చేయించడంతో విభేదాలు తారాస్థాయికి చేరుకొన్నాయి. ఈ పరిస్థితులలో జిల్లా పరిషత్ ఛైర్మన్ స్థాయి స్థానాన్ని ఆశ్రయించి నిర్మాణానికి అనుమతులు తెచ్చుకొని వాటిని పూర్తి చేయించారు. జూన్‌లో జిల్లా పరిషత్ పదవీకాలం ముగుస్తుండడంతో ఆలోపల ప్రారంభోత్సవం జరపాలని వారు భావించారు. అయితే ఆనం సోదరులు ప్రారంభోత్సవాన్ని నిలుపుదల చేయించేందుకు రాజధాని స్థాయిలో ప్రయత్నిస్తున్నారన్న సమాచారం అందుకొన్న కాకాణి హడావుడిగా భవనం ప్రారంభోత్సవం చేశారు. అధికారులు ముఖం చాటేసినా ఎమ్మెల్సీ వికపు బాలసుబ్రహ్మణ్యం ఒక్కరే వచ్చారు. దీని తర్వాత విమర్శలు వెల్లువెత్తాయి. దొంగ చాటుగా ప్రారంభోత్సవం జరిపారని, దీనిపై విచారణ జరిపించాలని రూరల్ ఎమ్మెల్యే వివేకానందరెడ్డి డిమాండ్ చేయగా, నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేరు పెట్టలేదని టిడిపి జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆరోపించారు. వీటన్నింటికి కాకాణి సమాధానం చెప్పుకొంటూ దొరల్లాగా ప్రారంభించామని, ఎలాంటి విచారణకైనా సిద్ధమని ప్రకటించడంతో పాటు నల్లపురెడ్డి పేరు ప్రభుత్వానికి ప్రతిపాదన చేస్తున్నామన్నారు.

అబ్బా... ఎండాకాలం!

• నానాపాట్లు పడుతున్న జనం



రోజురోజుకు అధికమవుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం ప్రజలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. మండుతున్న ఎండలు ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. వడదెబ్బకు గురై ఇప్పటికే నలుగురికి పైగా మరణించగా పలువురు ఆస్పత్రుల పాలవుతున్నారు. గ్రీష్మరుతువు ప్రారంభం నుంచే భానుడు నిప్పులు కక్కుతుండడంతో ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. ఏప్రిల్ నెల మొదటి వారంలోనే తట్టుకోలేనంతగా ఎండలు మండి పోతున్నాయి. పిల్లలు, పెద్దలు ఈ వేడిమి తాళలేక సొమ్మసిల్లుతున్నారు. మరోవైపు చికెన్‌ఫాక్స్ నగరంలో అధికంగా ప్రభావం చూపుతోంది. పలు ప్రాంతాల ప్రజలు ఈ వ్యాధిబారిన పడి అల్లాడి పోతున్నారు. మరోవైపు విద్యుత్‌కోత నగర వాసులకు నరకం చూపిస్తోంది. ఎండ వేడిమికి తోడు భరించలేని ఉక్కపోత ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నది. దీనికి తోడు పలు ప్రాంతాల్లో మంచినీరు కలుషితం అవుతుండడంతో ఎక్కడ డయేరియా లాంటి అంటురోగాలు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నీరు కలుషితమై వస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో నగర వాసులకు అంటురోగాల బాధలు తప్పేట్లులేవు.

• కార్పొరేషన్ కొత్త ప్రయోగం

చెత్తతో విద్యుత్



నగర పాలక సంస్థ పలు క్రొత్త విధానాలకు శ్రీకారం చుడుతోంది. ఆర్థిక భారాన్ని తగ్గించుకొనేది ఒకటి కాగా, మరొకటి చెత్తను వినియోగంలోకి తేవడం. నగరంలో వీధి దీపాల నిర్వహణను మునిసిపాలిటీయే చూస్తోంది. నగరంలో వివిధ ప్రాంతాలలో లైట్లు ఏర్పాటు చేయడం, వాటి బాగోగులు, సిబ్బంది నిర్వహణ సమస్తం ఇంతవరకు నగర పాలక సంస్థదే. విద్యుత్ బిల్లులు 19 లక్షల రూపాయలు వస్తుండేవి. పెరిగిన కరెంటు ఛార్జీల కారణంగా ఈ మొత్తం 22 లక్షలకు చేరుకొంటుండడం, సిబ్బంది జీతభత్యాలు తడిసి మోపెడవుతున్నాయి. ఈ పరిస్థితులలో వీటి నిర్వహణపై ప్రైవేట్ సంస్థలకు అప్పగించాలన్న యోచనలో ప్రభుత్వం వుంది. దీనికి సంబంధించి తగిన ఏర్పాట్లలో అధికారులు వున్నారు. విద్యుత్ బిల్లులో ఆదా, ఆర్థిక భారం తగ్గడం అటుంచితే కాంట్రాక్టు సిబ్బంది పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతుండడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. మరోవైపు చెత్తను ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తి చేయడంపైనా అధికారులు కసరత్తు చేస్తున్నారు. మునిసిపాలిటీలో త్వరలో అమలులోకి రానున్న ఈ రెండు విధానాల వల్ల నగరపాలక సంస్థకు ఎంత మేర ఉపయోగపడుతుందో వేచి చూడాలి.

డిగ్రీ ప్రశ్నాపత్రాల పంపిణీపై గగ్గోలు

డిగ్రీ పరీక్షలకు సంబంధించి ప్రశ్నాపత్రాల పంపిణీలో ఎస్వీ యూనివర్శిటీ వ్యవహరించిన తీరు పలు అనుమానాలను దారి తీస్తుంది. నగరంలో విక్రమ సింహపురి యూనివర్శిటీ ఏర్పాటైనప్పటికీ ప్రథమ సంవత్సరం పరీక్షలను మాత్రమే అది నిర్వహిస్తుండగా, ద్వితీయ, తృతీయ సంవత్సరం పరీక్షలను మాత్రం శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీయే చేపట్టింది. ప్రతి ఏడాది ఈ పరీక్షల ప్రశ్నాపత్రాలను డికెడబ్ల్యు కళాశాలలోను, విఆర్ కళాశాలలోను భద్రపరచి అక్కడ నుంచి ఆయా కళాశాలలకు తరలించేవారు. దీనికి భిన్నంగా యూనివర్శిటీ ప్రస్తుతం జరుగుతున్న పరీక్షలలో వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది. ప్రభుత్వ కళాశాలల ద్వారా పంపిణీ చేయాల్సిన ప్రశ్నాపత్రాలను ప్రైవేట్ కళాశాల ద్వారా అందజేయడంపై జిల్లావ్యాప్తంగా విపరీతమైన చర్చకు దారితీసింది. పలు అక్రమాలకు, అవకతవకలకు పాల్పడి, ర్యాంకుల, మార్కుల కోసం అడ్డదారులు తొక్కే ప్రైవేట్ కళాశాల ద్వారా మిగతా కళాశాలలకు పంపిణీ చేయడంతో ఈ ప్రశ్నాపత్రాల బండిల్స్‌ను తీసుకొనేందుకు నిరాకరించడంతో గందరగోళం నెలకొనింది. బిఎస్సీ తృతీయ సంవత్సరం ప్రశ్నాపత్రాలకు సంబంధించి జరిగిన ఈ వ్యవహారంపై చివరకు యూనివర్శిటీ అధికారులు జోక్యం చేసుకొని వివిధ కళాశాలల యాజమాన్యాలతో మాట్లాడి ఒప్పించడంతో ఈ వివాదం సమసి పోయింది. మొత్తం మీద యూనివర్శిటీ అధికారులు వ్యవహరించిన తీరు విమర్శల పాలయ్యింది.

పోలీసులకు సవాల్‌గా వరుస చోరీలు!



రంగనాయకులపేటలో గొలుసు కోసం మహిళ గొంతుకోసిన దృశ్యం.

నెల్లూరులో వరుసగా జరుగుతున్న చోరీలు పోలీసులకు సవాల్‌గా మారాయి. పట్టపగలు అదునుచూసి చేస్తున్న చోరీలకు జనం బెంబేలెత్తి పోతున్నారు. గడచిన నెలలో నగరంలో వివిధ చోట్ల అరకోటి రూపాయలకు పైగా దుండగులు దోచుకెళ్లారు. మార్చి 8వ తేది సరస్వతీనగర్‌లోని అపార్ట్‌మెంట్‌లో పట్టపగలు రెండిళ్లలో 120 సవర్ల బంగారు నగలు అపహరించారు. ఈ చోరీని మరవక ముందే మార్చి 28వ తేదీ మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఐసిఐసిఐ బ్యాంకు దగ్గర ఓ ఇంజనీరింగ్ కాలేజి ఉద్యోగి నుంచి 3.50 లక్షలు కొట్టేశారు. అదే రోజు ఎసి సెంటర్‌లో ఇస్కపల్లికి చెందిన ఓ వ్యక్తి కారును ఆపి విత్తనాలు కొనుగోలు చేయను ట్రంకురోడ్డులోనికెళ్లి వచ్చేసరికి కారు అద్దాలు పగులగొట్టి అందులోని మూడు లక్షల 70వేలు అపహరించారు. ఏప్రిల్ 1వ తేది రంగనాయకులపేటలోని తన ఇంటి వద్దనున్న మహిళను దుండగుడు దోచుకోబోగా ఆమె అడ్డుకొన్నందుకు కత్తితో దాడి చేశాడు. ఏప్రిల్ 6వ తేది బృందావనంలోని కార్పొరేషన్ బ్యాంకు వద్ద ఆపి వున్న కారులో నుంచి 20 లక్షలు చోరీ చేశారు. బ్యాంకుల దగ్గర ఒక పథకం ప్రకారం జరుగుతున్న ఈ చోరీలను అరికట్టడంలో నగర పోలీసులు విఫలమయ్యారు. భద్రత వుండే అపార్ట్‌మెంటుల్లో సైతం దొంగతనాలు జనాన్ని ఆలోచింప జేస్తున్నాయి. ప్రత్యేక పోలీసు బృందాలను రంగంలోకి దింపి నిఘా పెడితేగానీ ఈ దొంగలు దొరకరేమో?

ఆర్టీసిలో అనవసర రణం

కార్మికులు × అధికారులు

ఆర్టీసి అధికారులు, సిబ్బంది మధ్య గత కొంత కాలంగా నలుగుతున్న సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. అధికారులు సంస్థను లాభాలబాట పట్టించేందుకు పలు రకాల చర్యలు చేపడుతున్నామని ప్రకటిస్తుంటే, కార్మికులు మాత్రం అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. ఆదాయం పెంపుదలకు పలు చర్యలు చేపడుతున్నామని ఆర్టీసి ఆర్ఎం కొమరయ్య తెలిపారు. పొదలకూరు, గూడూరు ప్రాంతాల్లో కొత్తగా మైకా ఎక్స్‌ప్రెస్, సిలికాన్ ఎక్స్‌ప్రెస్ పేరుతో బస్సులను నడుపుతున్నట్లు ప్రకటించాడు. సెమీ లగ్జరీ, లగ్జరీ తదితర బస్సులలో 60 శాతం కంటే తక్కువ ఆదాయం వచ్చే బస్సులను తొలగించాలని ప్రభుత్వం సూచించినట్లు చెప్పారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. కార్మిక సంఘాలు మాత్రం అధికారుల తీరుపై మండిపడుతున్నారు. నెల్లూరు రీజియన్ పరిధిలో ప్రతిదానికీ సిబ్బందిని బలి చేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. విపరీతమైన ఒత్తిడితో పనిచేస్తున్న కార్మికులను అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ సస్పెండ్ చేస్తున్నారని ఆరోపించారు. యాక్సిడెంట్లు జరిగిన సందర్భాలలో డ్రైవర్ల వద్ద నుంచి రికవరీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ రవాణాను అడ్డుకోలేక బస్సులు రద్దు చేయడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నిస్తున్నారు.

మద్యం విక్రయాల రెట్టింపుకు సర్వం సిద్ధం!

జిల్లాలో మద్యం విక్రయాలను రెట్టింపు చేయాలని ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులు పంపిన రహస్య సర్క్యులర్‌ను అందుకొన్న నెల్లూరు అధికారులు జనాన్ని మద్యం మత్తులో ముంచే ప్రణాళికను సిద్ధం చేశారు.

ఎండలు ముదురుతుండడంతో జిల్లా వ్యాప్తంగా మద్యం అమ్మకాలు ఊపందుకున్నాయి. ప్రభుత్వ ఖజానాకు అత్యధికంగా ఆదాయం సమకూర్చే శాఖల్లో ఎక్సైజ్ ప్రధానమైంది. ఈశాఖ ద్వారా వచ్చే నిధులను వివిధ సంక్షేమ పథకాలకు ప్రభుత్వం కేటాయించి ఖర్చు చేస్తుంది. ఇప్పటికే నిధుల కొరత కారణంగా పలు పథకాలు నత్తనడకన నడుస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయంతో ఖజానా నింపుకోవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మద్యం విక్రయాలు మరింత రెట్టింపు చేయాలని ఆశాఖ అధికారులకు రహస్యంగా సర్క్యులర్ జారీ చేసింది.

సర్క్యులర్ జారీ చేసిన విషయాన్ని ఎక్సైజ్‌శాఖ అధికారులు గోప్యంగా వుంచి బార్లు, మద్యం విక్రయించే దుకాణాదారులపై మద్యం, బీరు విక్రయాలు రెట్టింపు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. అవసరమైతే మరిన్ని బెల్టుషాపులను ఏర్పాటు చేసుకోమని దుకాణదారులకు అనధికారికంగా సలహాలు కూడా ఇస్తున్నారు. గతంలో కంటే ఈ వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో మరిన్ని మద్యం బెల్టుషాపులు ఏర్పాటుచేసే అవకాశం కనిపిస్తుంది. టీ దుకాణాలకు పోటీగా మద్యం దుకాణాలు ఉదయాన్నే తెరచుకుంటున్నాయి. కేవలం ఆదాయాన్ని ధ్యేయంగా చేసుకొని ప్రభుత్వం మద్యం విక్రయాలు ప్రోత్సహిస్తుంది.

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పాలు దొరకకపోయినా మద్యం మాత్రం 24 గంటలు అందుబాటులో వుంటుంది. ఈ వేసవిలో మండల కేంద్రాల్లో వున్న దుకాణాల మాదిరిగా గ్రామీణ ప్రాంతాల్లో బెల్టు షాపుల్లో విక్రయాలు జరుగుతున్నాయి. ఇటీవలనే రాష్ట్రప్రభుత్వం బాటిల్‌పై 5నుంచి 10 రూపాయల వరకు పెంచడం జరిగింది. ఇలా పెంచడంతో సంవత్సరానికి జిల్లా నుంచి 100 కోట్ల రూపాయల ఆదాయం సమకూరుతుంది. వేసవిలో మద్యం విక్రయాలు రెట్టింపు చేసేందుకు ఎక్సైజ్‌శాఖ అధికారులు, సిబ్బంది జిల్లావ్యాప్తంగా పర్యటిస్తున్నారు. ఏప్రెల్ నుంచి సెప్టెంబర్ వరకు నెలకు కోటిరూపాయల వంతున విక్రయాలు జరగాలన్నది ఎక్సైజ్‌శాఖ లక్ష్యంగా చెబుతున్నారు.

ఎక్సైజ్ అధికారుల ఒత్తిడి తట్టుకోలేక వ్యాపారం జరిగినా జరగకపోయిన డిపో నుంచి మద్యం సరఫరా చేయించుకోక తప్పడం లేదని కొందరు దుకాణదారులు వాపోతున్నారు. ఈ వేసవి కాలంలో ఎక్సైజ్‌శాఖ నిర్ణయించిన టార్గెట్ పూర్తి చేసేందుకు సమయపాలనలో కూడా కొంత మినహాయింపు తీసుకోవాలని కోరుతున్నారు అధికారులు. నర సింహకొండ వద్ద వున్న మద్యం డిపో నుండి మార్చి నెలలో దాదాపు రోజుకి 50 లక్షల రూపాయల మద్యం సరఫరా జరిగినట్లు రికార్డులు చెబుతున్నాయి. మద్యం వ్యాపారులను ఏదో ఒక విధంగా ఒప్పించి అమ్మకాలను మరింత రెట్టింపు చేయాలని ఆశాఖ అధికారులు లక్ష్యంగా చేసుకొన్నారు.



దేవరపాళెంలోని స్టాక్ పాయింట్‌లో సరఫరాకు సిద్ధంగా వున్న మద్యం కేసులు .

బార్లు, మద్యం దుకాణాల వ్యాపారులు ప్రభుత్వం ధరలతో నిమిత్తం లేకుండా ఇష్టానుసారంగా ధరలను పెంచేశారు. ప్రభుత్వ ధర కంటే బాటిల్ మీద అదనంగా 10 రూపాయలు వసూలు చేస్తున్నారు. మద్యం ప్రియులు కూడా ధరల గురించి ప్రశ్నించకపోవడంతో వీరి వ్యాపారాలు మూడుపువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతున్నది. మొత్తం మీద ఈ వేసవి కాలంలో మద్యం విక్రయాల ద్వారా ప్రభుత్వ ఖజానా కాస్త ఎక్కువగా నింపుకొంటుంది.

తెలుగుగంగ బ్రాంచ్ కాల్వలు పూర్తయ్యేదెన్నడో?

తెలుగుగంగ బ్రాంచి కాల్వల నిర్మాణ పనులు ప్రారంభించి సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ కొన్ని అసంపూర్తిగానే వున్నాయి. 10 బ్రాంచి కాల్వల పనులు పూర్తి చేయాలని నిర్ణయించిన తెలుగుగంగ అధికారులు నిధుల కొరత కారణంగా పనులు పూర్తి చేయలేకపోతున్నారు. రాష్ట్రప్రభుత్వం కూడా సాగునీటి కాల్వల నిర్మాణ పనులకు నిధుల కేటాయింపు జరుగుతుందని ప్రకటిస్తుందే తప్ప నిధులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేస్తుంది. బ్రాంచి కాల్వల నిర్మాణం కోసం సర్వే జరిపి, భూసేకరణ కూడా చేపట్టారు.

బ్రాంచి కాల్వల నిర్మాణం చేపట్టే ప్రాంతాల్లో అటవీశాఖ భూమి కొంతమేర వుంది. దీంతో ప్రారంభ దశలో కొన్ని ఇబ్బందులు ఏర్పడినప్పటికి ప్రభుత్వ ఉత్తర్వులతో దీనిని అధిగమించారు అధికారులు. తెలుగుగంగ బ్రాంచి కాల్వల నిర్మాణం పూర్తిదశకు చేరుకుంటే రెండులక్షల యాభైవేల ఎకరాలకు పైగా సాగునీరు అందే అవకాశం వుంది. గూడూరు డివిజన్‌లోని సైదాపురం, మనుబోలు, గూడూరు, డక్కిలి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, బాలాయపల్లి నెల్లూరు డివిజన్ పరిధిలో పొదలకూరు, రాపూరు మండలాల్లోని భూములు సాగులోకి వస్తాయి.

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే తెలుగుగంగ బ్రాంచి కాల్వల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. మొత్తం ఏడు బ్రాంచి కాల్వలకు అప్పట్లోనే దాదాపు 50కోట్ల రూపాయలు ఖర్చు చేసింది ప్రభుత్వం. కొన్ని కాల్వల నిర్మాణ పనులు నాసిరకంగా చేపట్టడంతో కొన్ని నెలలకే లీకేజీలు ఏర్పడి నీరు వృధాగా పోయింది. 2005 సంవత్సరంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యతనివ్వడం జరుగుతుందని ప్రకటించడంతో రైతులు ఎంతో సంతోషించారు. అయితే అధికారులు, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల నిర్మాణ పనులు సకాలంలో పూర్తి కాకుండా పోయాయి.

తెలుగు గంగ బ్రాంచి కాల్వల నిర్మాణం పూర్తయితే గూడూరు డివిజన్‌లోని సైదాపురం, మనుబోలు, గూడూరు, డక్కిలి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, బాలాయపల్లితోపాటు నెల్లూరు డివిజన్ పరిధిలోని పొదలకూరు, రాపూరు మండలాల్లోని రెండు లక్షల యాభైవేల ఎకరాలకు సాగునీరు అందుతుంది.

గూడూరు డివిజన్‌లో వ్యవసాయానికి అనుకూలంగా వున్న భూముల్ని కేవలం వర్షపు నీటిపైనే ఆధారపడి సాగు చేసుకొంటున్నారు రైతులు. బ్రాంచి కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేయాలని పలు దఫాలు రైతులు విజ్ఞప్తి చేసినా ఎవరు పట్టించుకోవడం లేదు. ఈ కాల్వల నిర్మాణ పనులు తెలుగుగంగ అధికారుల పర్యవేక్షణలోనే పూర్తి చేయాల్సి వుంటుంది. ఇందులో నీటిపారుదలశాఖ అధికారులకు ఎటువంటి బాధ్యత వుండదు. తెలుగుగంగ అధికారులకు రైతుల ఇబ్బందులు, కష్టాల గురించి తెలియకపోవడంతో కాల్వల నిర్మాణ పనులు పూర్తి చేయించాలన్న ఆలోచన లేకుండా పోయిందన్నది ఈ ప్రాంత రైతుల అభిప్రాయం.

తెలుగుగంగ బ్రాంచి కాల్వల పనులు జరిగే నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ముగ్గురు ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీకి చెందిన వారు. ఎమ్మెల్యేలుగా గెలుపొందిన తొలిరోజుల్లో బ్రాంచి కాల్వల పనులపై పలు దఫాలు మాట్లాడిన వీరు ఆ తర్వాత ఏ కారణం చేతనో ఈ సమస్య గూర్చి ఎక్కడా లేవనెత్తిన దాఖలాలు కనిపించడం లేదు.



అధికారులకు పక్షపాతం తగదు!

● కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కస్సుబుస్సు

ప్రజాప్రతినిధులను గౌరవించడంలో అధికారులు పక్షపాత వైఖరి ప్రదర్శిస్తున్నారని కోవూరు శాసన సభ్యుడు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆరోపించారు. తీరు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వుంటుందని ఆయన అధికారులను హెచ్చరించారు. కొడవలూరు మండలం వెంకన్నపురం గ్రామంలో జిల్లాపరిషత్ నుంచి విడుదలైన 5లక్షల రూపాయల నిధులతో నిర్మిస్తున్న సిమెంటురోడ్డు పనులను జిల్లా పరిషత్ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డితో కలసి ప్రారంభించారు. అధికారులు ఆ పనులకు సంబంధించి శిలాఫలకం ఏర్పాటు చేయకపోవడంపై తీవ్రంగా స్పందించారు. పంచాయితీరాజ్ అధికారులు ప్రొటోకాల్‌ను పాటించకుండా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తూ ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని మండిపడ్డాడు. అధికారపక్ష నేతలు చెప్పినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పంచాయితీరాజ్ అధికారులు ఇటీవల జరిగిన శాసన మండలి ఎన్నికల్లో అధికారపక్షానికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. అలాంటి అధికారులను వదిలిపెట్టమని, రానున్న రోజుల్లో ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. పంచాయితీరాజ్ అధికారులు ఎసిబి దాడులకు భయపడి అవినీతి ఎక్కడ బయటపడుతుందన్న ఆందోళనతో అధికారపార్టీ నేతలు చెప్పినట్లు వ్యవహరిస్తున్నారని జడ్పీఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వుంటుందని హెచ్చరించారు.



కవి, విమర్శకుడు పాయసం సుబ్రహ్మణ్య మహర్షికి ఉగాది సత్కారం చేస్తున్న నగర శాసనసభ్యుడు శ్రీధరకృష్ణారెడ్డి, దేవరాల సుబ్రహ్మణ్యం, తిరసం అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు.



నెల్లూరులోని హెల్పింగ్ హ్యాండ్ సర్వీసు ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బీదలకు నిత్యావసరాలు అందజేస్తున్న నగర డిఎస్పీ రాధిక. ప్రక్కన ఆర్గనైజేషన్ అధ్యక్షుడు టి.కృష్ణారెడ్డి.

గూడులేని గృహ నిర్మాణ శాఖ

పొదలకూరులో పరిస్థితిది!

జిల్లాలోని నిరుపేదలకు గృహవసతి కల్పించే గృహనిర్మాణశాఖ కార్యాలయానికి భవనం లేని పరిస్థితి పొదలకూరు మండలంలో ఎదురయ్యింది. ఇక్కడి గృహనిర్మాణ శాఖ కార్యాలయానికి సొంతభవనం గాని, అద్దెభవనం గానీ లేకపోవడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయ క్వార్టర్స్‌లోని భవనం సముదాయంలో దీనిని నిర్వహిస్తున్నారు. ఈ భవనం కూడా శిథిలావస్థకు చేరుకొనింది. శ్లాబ్ పెచ్చులూడి పడుతుండడంతో విధులు నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది భయాందోళనలు చెందుతున్నారు. పొదలకూరును గృహనిర్మాణ శాఖ సబ్ డివిజన్ చేశారు. పొదలకూరు, రాపూరు, చేజర్ల, కలువాయి మండలాలను ఈ సబ్‌డివిజన్ పరిధిలోకి తీసుకొని వచ్చారు. అంత పరిధిగల కార్యాలయానికి సొంతభవనం లేకపోవడంతో అవస్థలు తప్పడం లేదు. చివరకు అద్దె భవనం తీసుకోక శిథిలభవనంలో కార్యాలయాన్ని నిర్వహిస్తుండడంతో అటు సిబ్బంది, ఇటు లబ్దిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక డిఇ, ఎఇ ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. వర్షాకాలంలో అయితే ఈ భవనం సొగసు చెప్పనవసరం లేదు. విలువైన రికార్డులు తడిచి పోతుండడంతో సిబ్బంది వాటిని భద్రపరచేందుకు నానా తిప్పలు పడాల్సి వస్తోంది.

తృతీయ వర్ధంతి



ఈ లోకం నుండి
అర్ధాంతరంగా
నిష్క్రమించిన
మిమ్మల్ని సదా
స్మరించుకుంటూ...

కీ॥శే॥ కసివరాజు సత్యనారాయణరావు గారు

Asst.Dir.of Agri. (Retd)

జననం : 03-03-1942
మరణం : 26-04-2008

భార్య
కసివరాజు వేంకట పార్వతి

కుమారులు - కోడళ్లు
కసివరాజు వేంకట రమణారావు - గంగాభవాని
కసివరాజు వేంకట సుబ్రహ్మణ్యం - జయలక్ష్మి

అల్లుడు - కుమార్తె
పోతరాజు రమేష్‌బాబు - వేంకట లలితకుమారి

మనుమలు - మనవరాలు
కృష్ణప్రదీప్, ప్రణయ్‌కుమార్, లక్ష్మీహిమజ, శ్రేయస్, సుమన్, శ్రీకర్

క్రికెట్ ప్రేమికుల రక్తదానం

ఆదర్శనీయం ఆత్మకూరు యువత

క్రికెట్ మ్యాచ్‌లో విశ్వవిజేతగా నిలచిన టీమ్ ఇండియాను అభినందించే కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరులో క్రీడాభిమానులు రక్తదానం చేశారు. స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ రక్తదాన శిబిరాన్ని తహశీల్దార్ ఎస్.శ్రీనివాసమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పి.జవహర్‌లాల్ కేక్ కట్ చేశారు. ఆయన మాట్లాడుతూ క్రికెట్‌లో భారత్ విశ్వవిజేతగా నిలవడం యావత్ భారతావనిని సంతోషంలో ముంచెత్తిందన్నారు. ఈ సంబరాల్లో ప్రాణదానమైన రక్తదానాన్ని చేపట్టడం అభినందనీయం అన్నారు. షుమారు 30 మందికిపైగా క్రీడాభిమానులు, యువకులు, విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, సంయుక్త కార్యదర్శి సాదిక్ హుస్సేన్, వైస్ ఛైర్మన్ వెంకట సుబ్బానాయుడు, కోశాధికారి ఉమామహేశ్వరావు, సభ్యులు వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, సురేష్‌బాబు, సాయిబాబా, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి ఘనత వర్ణించలేం!

గాయని వాణీ జయరాం

వెంకటగిరి విశ్వోదయ బాలికోన్నత పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఇటీవల ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ నేపధ్యగాయని వాణీ జయరాం విచ్చేసి ప్రసంగించారు. దేశంలోనే వెంకటగిరికి ఎంతో పేరు ప్రతిష్టలు వున్నాయన్నారు. దీనికి కారణం చేనేత కార్మికులు నేసే చీరలేనన్నారు. వెంకటగిరి చీరలంటే తనకు ఎంతో ఇష్టమన్నారు. నెల్లూరు వంటకాల గురించి చెప్పనవసరం లేదని పలుమార్లు వంటకాలను రుచి చూసి వున్నానన్నారు. రాచరికానికి, కళలకు పేరెన్నికగన్న వెంకటగిరిని చూడాలన్న కోరిక ఇన్నాళ్లకు ఫలించిందన్నారు. స్థానిక శాసనసభ్యుడు కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ కళలకు కాణాచి వెంకటగిరి అన్నారు. పట్టణంలో మ్యూజియం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానన్నారు. గూడూరు శాసన సభ్యుడు బల్లి దుర్గాప్రసాద్, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం, తిరుపతి మయూరి హోటల్ అధినేత జయరామ్ చౌదరి పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు బికె.ప్రసాద్, కార్యదర్శి జయరామయ్య, గాయనీ గాయకులు విల్సన్, సురేష్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మండలానికో మోడల్ స్కూల్!

ఈ విద్యా సంవత్సరం నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నట్లు గూడూరు డిప్యూటి డిఇఓ ప్రసన్నాంజనేయులు తెలిపారు. కండలేరు డ్యాం జడ్పీ ఉన్నతపాఠశాల వార్షికోత్సవ వేడుకలలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 5కోట్ల రూపాయల వ్యయంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. జాతీయ స్థాయిలో బాల శాస్త్రవేత్తలను తయారు చేసేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ఉత్తేజిత అవార్డులు అందజేస్తున్నదని వివరించారు.

110 మినీ డైరీలు!

జిల్లాలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో 110 మినీ డైరీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆశాఖ డిడి రవీంద్రనాధ్ తెలిపారు. తోటపల్లి గూడూరు మండలంలో పశువైద్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. మినీ డైరీలకు పావలా వడ్డీతో బ్యాంకుల ద్వారా రుణసదుపాయం కల్పిస్తామన్నారు. 2010–11 సంవత్సరానికి పశుక్రాంతి పథకం ద్వారా 1000 యూనిట్లు మంజూరు కాగా 758 యూనిట్లను రైతులకు పంపిణీ చేశామన్నారు. జిల్లాలో నిర్వహించిన గ్రామసభల్లో రైతులకు 912 యూనిట్లు అవసరంగా గుర్తించామన్నారు. ఒక్కొక్కటి 10వేల రూపాయలు విలువ చేసే 150 ముర్రాజాతి పడ్డలు జిల్లాకు మంజూరైనట్లు రవీంద్రనాధ్ ప్రకటించారు.

బుచ్చి కళాసాగర్ నాటకోత్సవాలు

బుచ్చిరెడ్డిపాళెంలో కళాసాగర్ ఉత్సవాలు జూన్ 2నుంచి ప్రారంభం అవుతాయని సంస్థ అధ్యక్షుడు దొడ్ల రమణయ్య తెలిపారు. 4రోజులపాటు జరిగే ఈ పోటీలు దివంగత చెన్నారెడ్డి సుబ్బారెడ్డి స్మారకార్థం జరుగుతాయన్నారు. ఈ నాటక పోటీలలో నూతన రచనలకు ప్రాధాన్యముంటుందని, అవి సాంఘిక ఇతివృత్తంతో వుండాలన్నారు. అవినీతిపై ప్రశ్నించే నాటకాలకు మొదటి ప్రాధాన్యత అన్నారు. ఈ కళాసాగర్ ఉత్సవాలలో ప్రదర్శించే ప్రతి నాటికకు 7500 రూపాయలతోపాటు ఉత్తమ నాటికకు ప్రత్యేక నగదు బహుమతి అందిస్తామన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు 9866800121 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

హిమ్ సంస్థ సామాజిక సేవ

బోగోలుకు చెందిన స్వచ్ఛందసంస్థ హిమ్ ఆధ్వర్యంలో కుష్టురోగులకు పింఛన్లు పంపిణీ చేపట్టారు. బోగోలు, కావలి ప్రాంతాలకు చెందిన 48మంది కుష్టురోగులకు 400 రూపాయలను ఈ సందర్భంగా సంస్థ రాష్ట్ర ఇన్‌చార్జి సువర్ణరాజ్ అందించారు. ఇకపై ప్రతినెలా వీరికి పింఛన్లు అందజేస్తామని ఆయన ప్రకటించాడు. ఈ మొత్తాన్ని ఆయా కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా వుండాలని సూచించారు.

నిబంధనలకు పాతర

బోగోలు పంచాయితీ పరిధిలో ఇళ్ల నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నా పట్టించుకొనే నాధుడే లేకుండాపోయారు. పలువురు ఇళ్ల నిర్మాణం పేరుతో కాలువలు, రోడ్లు ఆక్రమించి కట్టేస్తున్నా ఇదేమని ప్రశ్నించే వారే లేకుండా పోవడంతో వారిది ఇష్టారాజ్యం అయ్యింది. రోడ్డును ఇంటి స్థలంలో కలుపుకొని ఇళ్లు కట్టుకోవడం, పంటకాలువలు, మురుగు నీటి కాలువలను ఆక్రమించివేసి వాటి మీద గృహాలకు మెట్లు నిర్మించుకొంటుండడం

బోగోలులో ఇళ్ల నిర్మాణాల తీరిది

కొంతకాలంగా అధికమయ్యింది. ఈ ఆక్రమణలు జోరందుకొన్నా పట్టించుకొనేవారే లేకపోవడం, చివరకు అధికారులకు పలుమార్లు విన్నవించుకొన్నా స్పందించకపోవడంతో ప్రజలు రగిలిపోతున్నారు. ఈ ఆక్రమణలను కొందరు నేతలు ప్రోత్సహిస్తుండడంతో అధికారులకు తెలిసినా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినవస్తున్నాయి. ఎంత రాజకీయ అవసరాలు, మొగమాటాలున్నా బహిరంగంగా రోడ్లు, కాలువలు ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే చూస్తుండడం ఎంతవరకు సమంజసమో అధికారులకే తెలియాలి.

పేరుకొన్న ఇంటి పన్నులు!

కావలి డివిజన్‌లో పరిస్థితిది.

కావలి డివిజన్‌లో ఇంటి పన్నుల బకాయిలు రెండుకోట్ల రూపాయల మేర పేరుకపోయాయి. పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లు ఎంతగా దడబడలు చేస్తున్నా మొండి బకాయిలు వసూలు చేయలేకపోతున్నారట. వీటి వసూళ్ల కోసం స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నట్లు డిఎల్‌పిఓ బాదుషాఖాన్ తెలిపారు. ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి బకాయిల వసూళ్లకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. రాబోయే పంచాయితీ ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా తగినచర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.


వికటించిన వైద్యం!

కలిగిరి పిహెచ్‌సి దగ్గర రగడ

కలిగిరి మండలం ఆరోగ్య కేంద్రానికి ప్రసవం కోసం వచ్చిన మహిళ మృతి చెందడం గొడవకు దారి తీసింది. మండలంలోని ఎర్రతోటకు చెందిన వసంత అనే గర్భిణి రెండో కాన్పు కోసం పిహెచ్‌సిలో చేరింది. నొప్పులు రాకపోవడంతో స్టాఫ్‌నర్స్ స్వరూపరాణి విధులు ముగించుకొని వెళుతూ ఆమెను ఇంటికి పంపింది. తిరిగి ఆమె బంధువులు రాత్రివేళ స్టాఫ్ నర్సును వెంటబెట్టుకొని ఆరోగ్య కేంద్రానికి తీసుకొని వచ్చారు. ఈ సమయంలో నర్సు ఇంజక్షన్ చేసింది. కొంత సేపటికి ఆమె మృతి చెందడంతో ఆ ఇంజక్షన్ వికటించి వసంత మరణించిందని ఆమె తరపువారు ఆస్పత్రి వద్ద గందరగోళం సృష్టించారు. కావలి – ఉదయగిరి రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. సమాచారం అందుకొన్న అదనపు వైద్యాధికారి దశరధరామయ్య, ఉదయగిరి వైద్యాధికారి మాసిలామణి పిహెచ్‌సి వద్దకు చేరుకొని పరిస్థితి సమీక్షించారు. పోలీసులు, స్థానిక నేతలు మృతురాలు బంధువులతో మాట్లాడి శాంతింపచేయడంతో వివాదం సర్దుమణిగింది. ఉమ్మనీరు రక్తంలో కలసినందువల్లే ఆమె మృతి చెందింది తప్ప ఇంజక్షన్ వికటించి కాదని అధికారులు ప్రకటించారు.

సప్తమ వర్ధంతి

మరణం 16-04-2004 | 16-4-2011



స్వర్గీయ **సోమిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి** గారు

కాలం కరిగి నీరవుతున్నా....
మా హృదయ ఫలకాలపై చెక్కిన
సజీవ శిల్పం మీ రూపం...

కాల గమనం కూడా మాన్పలేని గాయమిది
మీరు చూపిన ప్రేమ ఆప్యాయతలను
ఆశయాలను మననం చేసుకొంటూ...
అశ్రునయనాలతో శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

భార్య
సోమిరెడ్డి ప్రశాంతి

అమ్మ
సోమిరెడ్డి హైమావతమ్మ

కుమారుడు
సోమిరెడ్డి అర్జున్‌రెడ్డి

కుమార్తె - అల్లుడు
సన్నారెడ్డి నీలిమా రెడ్డి
సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి


మనుమరాలు
శివాని

ఉండవల్లికి అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందా!



జగన్‌పై ఎదురుదాడికి ఎమ్మీ ఉండవల్లి అరుణ్‌కుమార్‌కు కాంగ్రెస్ అధిష్టానం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిందా? అవుననే అంటున్నాయి కాంగ్రెస్ వర్గాలు. ఉప ఎన్నికలకు ముందు జగన్ ఇమేజ్‌ను దెబ్బ తీసేందుకు అధిష్టానం ఉండవల్లిని ప్రత్యేకంగా నియమించిందట. వై.ఎస్‌కు అత్యంత సన్నిహితుడైన ఉండవల్లికి గతంలో జరిగిన రహస్యాలు తెలుసు. అదీ గాక కెవిపికి ప్రధాన అనుచరుడు కాబట్టి జగన్‌ను నిలువరించే సత్తా ఉండవల్లికి మాత్రమే వుందని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. కెవిపి కొంతకాలంగా జగన్‌కు దూరంగా వుంటున్నాడు. కెవిపిని కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా మార్చగలిగితే జగన్‌ను ఎదుర్కోవడం పెద్ద కష్టం కాదన్నది ఢిల్లీ పెద్దల అభిప్రాయం. అందుకే ఉండవల్లిని పురమాయించినట్లు చెబుతున్నారు. అధిష్టానం ఆదేశాలు ప్రకారం ఉండవల్లి రంగంలోకి దిగి జగన్‌ను ఇరకాటంలో పెట్టే ప్రయత్నం మొదలుపెట్టాడు. వైఎస్‌పై ప్రేమను ఒలకబోస్తూనే జగన్ అవినీతిని రట్టు చేయాలన్నది ఉండవల్లి వ్యూహం. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్ది ఉండవల్లి విప్పే గుట్టు మరింత ఘాటుగా వుండబోతుందని కాంగ్రెస్ వర్గాలు అంటున్నాయి. చూద్దాం...

సిఎం సోదరుడి పేరుతో మార్కెటింగ్ మోసం




సిఎం సోదరుడి పేరుతో వ్యవసాయ మార్కెటింగ్‌శాఖలో ఓ పెద్ద మోసం జరుగుతోంది. ఆశాఖకు చెందిన మార్కెట్ కమిటీల్లో ఔట్ పోర్సింగ్‌పై పనిచేస్తున్న 3వేల మంది సెక్యూరిటీగార్డుల్ని పర్మినెంట్ చేయిస్తామంటూ ఓ ముఠా రంగంలోకి దిగింది. సిఎం సోదరుడితో ఒప్పందం కుదిరిందని, ఒక్కొక్కరు 50వేల వంతున ఇస్తే ఉద్యోగం ఖాయమంటూ ఆ ముఠా డబ్బులు వసూలు చేస్తోంది. ఈ విషయం కాస్తా సిఎం దాకా వెళ్లింది. దాంతో ఈ విషయమై వెంటనే విచారణ జరిపించమంటూ ఆశాఖ అధికారుల్ని ఆదేశించాడు. అయితే ఆశాఖ అధికారులు ఇదంతా మామూలేనంటూ విచారణను చెత్తబుట్టలో పడేశారు. అక్రమార్కుల ముఠా మాత్రం యధేచ్ఛగా డబ్బులు వసూలు చేస్తున్నారు. మార్కెటింగ్ మంత్రి వద్ద పనిచేస్తున్న ఓ వ్యక్తిగత సహాయకుడు కూడా ఈ మోసానికి అండగా వున్నాడట. దీంతో అక్రమ వసూళ్లకు అంతే లేకుండా వుందట. వింటున్నారా! సిఎంగారూ!!

ఆస్తుల ప్రకటనకు ఐఎఎస్‌లు ససేమిరా...



సుప్రీంకోర్టు జడ్జీలతో సహా ప్రభుత్వ ఉద్యోగులందరూ ఆస్తుల్ని ప్రకటిస్తుంటే... ఐఎఎస్‌లు మాత్రం ససేమిరా అంటూ మారాము చేస్తున్నారు. ప్రభుత్వంలో కీలకస్థానాల్లో వ్యవహరించే ఐఎఎస్‌లు వందల కోట్ల రూపాయల్ని అక్రమంగా కూడబెట్టుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్‌గా వున్న సమాల్ రాష్ట్రంలోని పలువురు ఐఎఎస్‌ల అక్రమార్జన గురించి ప్రభుత్వానికి నివేదిక ఇచ్చాడు కూడా. అయితే ఐఎఎస్‌లంతా కలిసి సమాల్‌ను ముప్పుతిప్పలు పెట్టారనుకోండి... అదే వేరే సంగతి. సమాల్ జాబితాలో వున్న డిఎస్.మూర్తి రిటైర్ అయ్యాక ఎసిబి దాడి చేస్తే వందకోట్లకుపైగా ఆస్తులు వెల్లడయ్యాయి. కేవలం సమాల్ జాబితాలోని వారే గాక మరి కొంతమంది కూడా కోట్లకు పడగలెత్తిన వారున్నారన్న సమాచారం ప్రభుత్వం వద్ద వుంది. అయితే ప్రభుత్వంతో అవసరాలుంటాయి కాబట్టి ఐఎఎస్‌ల జోలికి పోవడం క్షేమం కాదంటూ పాలకులు ఉదాసీనంగా వుంటున్నారు. ఇప్పుడు కేంద్రప్రభుత్వం ఐఎఎస్‌ల ఆస్తుల ప్రకటనను తప్పని సరి చేసింది. ఏప్రిల్ 20వ తేదీలోగా స్వచ్ఛందంగా ఆస్తుల్ని ప్రకటించాలని తాకీదు జారీ చేసింది. ఎలాగైనా ఈ నిర్ణయాన్ని వాయిదా వేయించాలంటూ ఐఎఎస్‌ల ఆస్తుల వివరాలు కూడా సమాచారహక్కు చట్టం పరిధిలోకి వస్తాయని ఇటీవల రాష్ట్ర సమాచార కమిషన్ తీర్పు చెప్పినా ఇంతవరకు దాన్ని గురించి పట్టించుకున్న వారే లేరు... ఐఎఎస్‌లా? మజాకానా!

"కిరణ్"కు అగ్ని పరీక్ష



కడప ఉప ఎన్నికలు సిఎం కిరణ్‌కు అగ్ని పరీక్షలా మారాయి. కడపలో జగన్‌ను నిలువరించే బాధ్యత కిరణ్‌దేనని అధిష్టాన పెద్దలంటున్నారు. ఎన్నికల్లో అనుసరించే వ్యూహం దగ్గర నుంచే... ఓట్ల కొనుగోలు తదితర వ్యవహారాలన్నీ కిరణ్ స్వయంగా చూసుకోవాలంటూ ఢిల్లీ పెద్దలు ఇప్పటికే వర్తమానం పంపారు. కిరణ్‌ను ఢిల్లీకి పిలిపించుకొని కడప ఉప ఎన్నికల వ్యూహం... తీసుకుంటున్న చర్యల గురించి కూడా అధిష్టానం చర్చించింది. ఉప ఎన్నికల్లో గనక జగన్‌ను ఓడించగలిగితే వచ్చే సాధారణ ఎన్నికల వరకు కిరణ్ ప్రభుత్వానికి ఢోకా వుండదు. అయితే కాంగ్రెస్ గనక బోల్తాపడితే మాత్రం కిరణ్ స్థానంలో నాలుగో కృష్ణుడు సిఎం కుర్చీలో కూర్చునే అవకాశం లేకపోలేదని గాంధీభవన్ వర్గాలు చెవులు కొరుక్కుంటున్నాయి.


ట్రంకురోడ్డు బాతులు

వారు వీరయ్యారు!



వడ్డించేవాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా ఇబ్బంది లేదని పెద్దలు చెప్పినట్లు నెల్లూరులో పొదుపు సంఘాల్లోని మహిళలకు రాష్ట్ర ఆర్థికమంత్రి రామనారాయణరెడ్డి, మునిసిపల్ మంత్రి మహీధర్‌రెడ్డి దీపం గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు. కొత్తగా కట్టిన కార్పొరేషన్ ఆఫీసు వద్ద ముగ్గురు మహిళలకు తమ చేతుల మీదుగా మంత్రులు ఈ సిలిండర్లు పంపిణీ చేశారు. తీరా ఈ జాబితా చూస్తే దీనిలో మహిళలకు బదులు ఖాదర్‌బాషా, సందానిబాషా, ఆశీర్వాదం, వెంకటరమణయ్య అంటూ పురుషుల పేర్లు ప్రత్యక్షమయ్యాయి. వీరంతా కాంగ్రెస్ కార్యకర్తలు. ఎమ్మెల్యే వివేకానందరెడ్డి, ఆయన అనుంగు శిష్యులైన మాజీ కార్పొరేటర్లు చేసిన మాయాజాలంతో మహిళల జాబితాలో పురుష పుంగవులు వచ్చేశారు. వారు వీరై సిలిండర్లు పట్టుకెళ్లారు.

నెల్లూరులోనూ హజారే హవా!



అవినీతిపై యుద్ధం ప్రకటించిన సంఘసంస్కర్త అన్నా హజారే నిరసన దీక్షకు నెల్లూరులోనూ జనం నీరాజనాలు పలికారు. అవినీతిని రూపుమాపే జన లోక్‌పాల్ బిల్లు రూపకల్పనకు ప్రభుత్వం ముందుకు రావాలంటూ సమాచార హక్కు సంరక్షణ సమితి కార్యకర్తలు గాంధీబొమ్మ వద్ద నిరాహార దీక్ష చేశారు. టీవీ9, లోక్‌సత్తా, చివరికి జర్నలిస్టులు సైతం హజారేకు మద్దతుగా వివిధ కార్యక్రమాలు చేపట్టడంతో ట్రంకురోడ్డులో హజారే ఎవరన్న విషయమై పెద్ద ఎత్తున చర్చ జరిగింది. స్వల్ప కాలంలో ఇంత జనం మద్దతు లభించిన వ్యక్తి హజారే కావడం విచిత్ర మనవచ్చు.



ప్రోటోకాల్ 'సెగలు'


జిల్లా రాజకీయాల్లో ఎవరు బలవంతులో వారు చెప్పినట్లు తలాడించే డూడూ బసవన్నలుగా వివిధ శాఖల అధికారులు తయారయ్యారు. దీనివల్ల ప్రోటోకాల్ చిచ్చు రేగింది. కోవూరు నియోజకవర్గంలో ఓ రోడ్డు ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డిని తీసుకవెళ్లగా అక్కడ శిలాఫలకం లేదు. గూడూరులో ఏ శిలాఫలకంపైనా తన పేరు వుండడం లేదని ఎమ్మెల్యే దుర్గాప్రసాద్ ఈ వారంలో జరిగిన జడ్పీ సమావేశంలో లబోదిబోమన్నారు. ఎమ్మీ రాజమోహన్‌రెడ్డి, జడ్పీఛైర్మన్ కాకాణి గోవర్ధన్ రెడ్డి కూడా శిలాఫలకంలో పేరులేని వ్యక్తుల జాబితాలో వుండడం విశేషం. నెల్లూరులో గతంలో ఈ రచ్చ తక్కువే. ఈ మధ్య మారిన రాజకీయాల మూలంగా ఎక్కువయ్యింది. ఇది ఎక్కడకుపోయి ఆగుతుందో తెలియదు.

నెల్లూరులో కళాభవన్ మణి




జెమిని చిత్రంలో చిత్రవిచిత్రంగా ప్రవర్తిస్తూ కనపడేనటుడు కళాభవన్ మణిని ప్రేక్షకులు అంత సులభంగా మర్చిపోలేరు. కళాభవన్ మణిని పోలిన మనిషి నెల్లూరు నగరంలో వున్నాడు. ఆయన ఎవరో కాదు. త్రీటౌన్ ఎస్ఐ పెంచలరెడ్డి. ఈ ఎస్ఐ మాట తీరు, నడత అంతా మణిలా వుండడంతో జనం కూడా ఈయన్ను ఎస్ఐ అనకుండా విలన్‌లా వున్నారే అంటుండడం ఆయనకు పెద్ద ఇబ్బందిగా మారింది.

వెనక్కు తగ్గిన వివేకా!



తనది తప్పయినా ఎదుటివారి మీద రంకెలు వేస్తూ ఉరికే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి తొలిసారిగా కాస్త వెనక్కు తగ్గారు. నెల్లూరులో కొత్తగా కట్టిన చేపల మార్కెట్ శిలాఫలకంపై ఎమ్మీ రాజమోహన్‌రెడ్డి పేరు లేకుండా పోవడంతో ఆయన వుగ్ర నరసింహుడయ్యాడు. చేసిన తప్పును సరి దిద్దుకోకపోతే తీవ్ర పరిణామాలు వుంటాయని ఎమ్మీ హెచ్చరించడంతో వివేకానందరెడ్డి ముందు కొచ్చి సాంకేతిక పొరపాటు వల్ల ఎమ్మీ పేరు లేకుండా పోయింది. ఇది కాంట్రాక్టర్ చేసిన తప్పిదం. అధికారులు దీన్ని సరి చేస్తారు. గతంలో జరిగిన ప్రారంభోత్సవాల్లో ఆయన పేరు లేకుండా చేశామా? ఒక్క శిలాఫలకంపై లేకుండాపోతే అంత పరుషానికి పోతే ఎలానంటూ సన్నాయి నొక్కులు నొక్కారు.

కరుణామయునికి శిలువ వేసిన బాధాకరమైన రోజే



గుడ్‌ఫ్రైడే!

క్రైస్తవులందరూ పవిత్ర దినంగా భావించే రోజు గుడ్‌ఫ్రైడే. దీనినే శుభ శుక్రవారం అంటారు. ఏసుక్రీస్తును శిలువ వేసిన రోజును గుడ్‌ఫ్రైడేగా జరుపు కొంటారు. ప్రపంచ వ్యాప్తంగా వున్న క్రైస్తవ ధర్మాన్ని అనుస రించే వారందరూ ఆ రోజున బరువెక్కిన హృదయాలతో జీస స్‌ను స్మరించుకొంటారు. కల్వరి కొండపై దైవ కుమారుడైన ఏసును శిలువ వేస్తారు. ఆ శిక్షకు గురికాబడిన ఏసుక్రీస్తు మరణం యొక్క జ్ఞాపకాలను మననం చేసుకొనే రోజుగా గుడ్ ఫ్రైడేకు ఎంతో ప్రాముఖ్యత వుంది. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలలో దీనిని పవిత్ర దినంగా భావిస్తారు. ఈ శుభ శుక్ర వారాన్నే గాడ్స్‌ఫ్రైడే అని, హోలీఫ్రైడే అని, బ్లాక్‌ఫ్రైడే అని పలు రకాలుగా పిలుస్తారు.

గుడ్‌ఫ్రైడే రోజు క్రైస్తవులందరూ ప్రాయశ్చిత్త ఉప వాసాలు వుంటారు. లోకాన్ని రక్షించే ఏసు ప్రజల పాపాలను తొలగించేందుకు శిలువ శిక్షకు సిద్ధమై చివరి శ్వాస విడచి నందుకు గుర్తుగా ఆనాడు పలు ప్రధాన చర్చిలలో కొయ్యతో చేసిన శిలువను మోస్తారు. ప్రత్యేక ప్రార్థనల సందర్భంగా దానిని ముద్దాడుతారు. కల్వరికొండపై శిలువ వేసిన అనంతరం ఏసుక్రీస్తు 6 గంటలపాటు విపరీతమైన బాధను అనుభవించినట్లు చెప్తారు. చివరి 3 గంటలు అనగా 12 గంటల నుంచి 3 వరకు ఆ ప్రాంతంలో చిమ్మచీకటి ఆవరించి, ప్రళయం సంభవించినట్లు మతగ్రంధాలు పేర్కొంటున్నాయి. ఆ సందర్భంగా జీసస్ శిలువపై పలికిన ఏడు మాటలను భక్తులకు చేసిన సందేశంగా భావించి ఆ వాక్యాలను గురించి చర్చిల్లో మతపెద్దలు మాట్లాడుతారు. క్రీస్తు లాస్ట్‌సప్పర్‌ను ముందు రోజైన గురువారం చేసినందున గుడ్‌ఫ్రైడేకు ముందు రోజు క్రైస్తవులు ఆహారం తీసుకొని మరుసటి రోజు వరకు ఉపవాస దీక్షలో వుంటారు. గుడ్‌ఫ్రైడే నాడు శిలువపై ప్రాణాలు విడచిన ఏసు ఆదివారం నాడు పునరుజ్జీవుతుడైనందున ఆరోజును ఈస్టర్ సండేగా భావిస్తారు.

● దక్షిణాది, ఉత్తరాది సినీతారల సంగమోత్సవం

టిఎస్ఆర్, టీవీ9 సినీఅవార్డుల ప్రదానోత్సవం!

తిక్కవరపు సుబ్బరామిరెడ్డి తప్ప మరొకరు చేయలేని పనిది.

శివుడాజ్ఞ లేనిదే చీమ కుట్టదనడం ఎంత నిజమో; తిక్క వరపు సుబ్బరామరెడ్డి పాత్ర, ప్రమేయం లేకుండా హైదరాబాదులో ఏ కళా సమ్మేళనమూ జరగదనడం అంతే సత్యం. గత నలభై ఏళ్లుగా, ఇంకా పైనే ఏమో, అదొక సాంప్ర దాయం. ఆనవాయితీ. కళలలో ఈశ్వరానుగ్రహం ప్రసాదించే శక్తి వుందన్నది సుబ్బరామిరెడ్డి గారి నమ్మకం. ఆయనెంతటి శివ భక్తుడో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అందువల్ల ఏళ్లు గడిచే కొద్దీ ఆయనలోని కళాతృష్ణ పెరుగుతున్నదే తప్ప తరగడం లేదు. దీనికి పరాకాష్ట – టిఎస్ఆర్ టీవీ9 సినీ అవార్డుల ప్రదానం.

సినిమాలకు అవార్డులు చాలామంది ఇస్తున్నారు. ఫిలిం ఫేర్ వంటి సంస్థలిచ్చే అవార్డులకు ఎంతో ప్రాచుర్యం వుంది. భారతదేశానికి అవి ఆస్కార్‌తో సమానం. ఏ కళాకారుడైనా తనకొచ్చే పారితోషికం కంటే, తన కళను మెచ్చే మంచి మాటను కోరుకొంటాడు. నోట్ల కట్టలకంటే, చప్పట్ల మోత కళాకారుడికి ఎక్కువ కిక్కు కల్గిస్తుంది. ఆ కోరిక తీర్చే మార్గం అవార్డుల ప్రదానం. కళాకారుల మనసు బాగా ఎరిగిన వాడు కావడంతో సుబ్బరామరెడ్డి ఆ సత్కార్యానికి ఒక వ్యవస్థ రూపం కల్పించాడు. అటు దక్షిణాది, ఇటు ఉత్తరాది సినిమా తారలం దరినీ కలిపి, ఒక వేదిక మీద, ఒకే సంస్థ ద్వారా అవార్డులు ఇచ్చే సాంప్రదాయానికి తెర తీశాడు. సాధారణంగా సినిమా అవార్డులంటే, ఎవరో కొందరు కూర్చుని నిర్ణయిస్తూ వుంటారు. వారి ఇష్టా ఇష్టాలకు అనగుణంగా విజేతలు నిర్ణయమౌతూ వుంటారు. దానివల్ల తమకు న్యాయం జరగలేదనే అసంతృప్తి కళాకారులకు వుంటుంది. సుబ్బరామరెడ్డి గారు ఆ పేచీ తలెత్త కుండా ప్రజల నుంచే ఉత్తమ కళాకారులను ఎంపిక చేసే పద్ధతి అవలంభించాడు. టీవీ9 ఛానల్ ద్వారా ప్రజల నుంచి మొబైల్ ఫోన్ మెసేజ్‌లతో ఓటింగ్ పెట్టి ఉత్తమ కళాకారులను ఎంపిక చేశారు. ఈ అవార్డులు ఒకరోజు ఇచ్చి సరిపెట్టకుండా శాశ్వ తంగా కొనసాగించాలన్నది ఆయన కోరిక. అందుకు తగిన ఏర్పాట్లు చేసి మరీ మొదటి ఉత్సవాన్ని మొన్న 9తేది శిల్ప కళా వేదికలో అంగరంగ వైభవంగా జరిపించాడు.

ఒక్క మాటలో చెప్పాలంటే, భారతీయ సినీ కళా రంగా నికి ఉమ్మడి వేదికగా జరిగిందా ఉత్సవం. హిందీ సీమ నుంచి ధర్మేంద్ర, శత్రుఘ్నసిన్హా, సుభాష్ ఘాయ్, మహిమా చౌదరి, జుహీ చావ్లా, రవీనా టాండన్ వంటి హేమాహేమీలంతా వచ్చారు. తెలుగు చిత్ర పరిశ్రమ సంగతి చెప్పనే అవసరం లేదు. వారు వీరని పేర్లు చెప్పాల్సిన అవసరమే రాలేదు. చిరం జీవి, అక్కినేని, మోహన్‌బాబు, బాలకృష్ణ, నాగార్జున, రాజేంద్ర ప్రసాద్, రామానాయుడు, వెంకటేష్, కృష్ణంరాజు, జయప్రద, జయసుధ, విజయశాంతి, ఇలియానా, ప్రియమణి, సమంతా... అందరూ వచ్చారు. తమిళ తారలతో కూడా వేదిక తళతళ లాడింది.

సుబ్బరామరెడ్డి గారు కొద్దిసేపే మాట్లాడినా, వేలాది మంది సభికుల గుండెలను స్పృశించే తీరులో మాట్లాడారు. ఈశ్వరానుగ్రహం వుండే వారే కళాకారులు కాగలరు. అటు వంటి కళాకారులంటే నాకు ప్రాణం. కళలంటే ఎనలేని అభి మానం. కళల ద్వారా ఈశ్వరానుగ్రహం పొందాలన్నది నా తాప త్రయం. ఇప్పటి వరకు ఫిలిం ఫేర్ అవార్డులకే దేశంలో ఖ్యాతి. ఇక నుంచి టిఎస్ఆర్ అవార్డులకు ఆ ఘనత దక్కాలన్నది నా

కొరవ 14వ పేజీలో



విజయశాంతిని సన్మానిస్తున్న టి.సుబ్బరామిరెడ్డి, ధర్మేంద్ర, జుహీచావ్లా, మోహన్‌బాబు.



తెలుగు, హిందీ పరిశ్రమలలో ఎవర్ గ్రీన్ హీరోలు చిరంజీవి, ధర్మేంద్ర, అక్కినేని నాగేశ్వరరావు, గ్లామర్ హీరోయిన్ ఇలియానాల మధ్య తిక్కవరపు సుబ్బరామరెడ్డి.



మేషం
అశ్వని, భరణి, కృత్తిక 1 పా

కంటికి, ఊపిరితిత్తులకు సంబంధించి ఇబ్బందులుండవచ్చు. కళత్ర సంబంధం చక్కగా ఉంటుంది. పెద్దల సాయంతో ఉద్యోగవృద్ధి, వేతన వృద్ధి ఉంటుంది. చిరకాలంగా ఎదురు చూస్తూవచ్చిన శుభఫలితాలు అనుభూతిలోకి వస్తాయి. శత్రువులు లొంగి నడచుకొంటారు. బంధువులకు మీ చేతనైన సహాయం చేస్తారు. వ్యాపారులు కొత్తసంబంధాలు ఏర్పరచుకొంటారు. రాజకీయులకు ప్రోత్సాహకరమైన కాలం.



వృషభం
కృత్తిక 2,3,4 పా. రోహిణి, మృగశర 1,2 పా

పాదాలకు సంబంధించిన బాధలతో పాటు మర్మావయవ బాధలుంటాయి. అగ్నిప్రమాదావకాశాలు. కుటుంసభ్యుల అనాదరణ ఉన్నా రోజులు సాధారణంగా గడచిపోతాయి. తండ్రి, తండ్రివంటివారికి ఇబ్బందులుండవచ్చు. గృహాలంకరణ విషయాలలో ఆసక్తి చూపుతారు. ఖర్చుకు వెరవరు. ప్రతి పనిలో దూకుడు అధికం. విద్యార్థులకు ప్రయోజనవంతమైన కాలం. అన్ని రంగాలలో ముందంజ వేస్తారు.



మిథునం
మృగశర 3,4 పా. ఆర్ద్ర,పునర్వసు,1,2,3 పా

ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి. తోటివారు సాయమందిస్తారు. నూతన మిత్రులు ఏర్పడతారు. నోటికి సంబంధించిన అనారోగ్య బాధలుంటాయి. విదేశీ ప్రయాణావకాశాలు కానవస్తున్నాయి. గృహ నిర్మాణ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. వ్యాపారవృద్ధి చక్కగా సాగుతుంది. కొత్త భాగస్వామి లేదా మంచి అనుచరులు లభిస్తారు. రాజకీయులకు మేలైన కాలం. విద్యార్థులకు యోగకాలం.



కర్కాటకం
పునర్వసు 4 పా. పుష్యమి, ఆశ్లేష

దూర ప్రయాణావకాశాలు. చాలా ప్రోత్సాహకరమైన కాలం. ప్రయాణాలలో జాగ్రత్త. అనుకొన్న పనులు అనుకొన్నరీతిలో సాగుతాయి. సంతానమూలంగా సుఖశాంతులు లభిస్తాయి. వారి విద్యారంగం ప్రోత్సాహకరంగా ఉంటుంది. ధనవిషయంలో లోటుండదు. భవిష్యత్తుకు మంచి పథకాలు వేస్తారు. పురోభివృద్ధి అన్ని రంగాలలో ఉంటుంది. రాజకీయులకు అత్యంత అనుకూలమైన కాలం.



సింహం
మఖ, పుబ్బ ఉత్తర 1 పా

గాయాలు తగిలే అవకాశాలెక్కువ. ఆంత్ర సంబంధిత బాధలుండవచ్చు. ధన విషయంలో కటకట ఉండవచ్చు. సోదరుల సాయమందుతుంది. మిత్రులు ఆర్థికవిషయాలలో మంచి సలహాలిస్తారు. వ్యాపారులకు గడచిన వారంలో ఏర్పడ్డ నష్టాలను ఈ వారంలో పూడ్చుకో వీలవుతుంది. ఇంటిలో వివాహసంబంధవిషయాలు ప్రస్తావనకు వస్తాయి. రాజకీయులకు దురదృష్టకాలం.



కన్య
ఉత్తర 2,3,4పా., హస్త, చిత్తా 1, 2 పా

వాతం, కీళ్ల బాధలు బాధిస్తాయి. సంతానమూలంగా మానసిక వేదనకు గురౌతారు. ముందుచూపుతో అడుగేయాలి. ప్రతి విషయంలో ఎదుటివారు తప్పుగా అంచనా వేస్తారు. కోరినా సలహాలివ్వవద్దు. గుట్టుగా కాలం గడపడం మంచిది. ఆర్థిక విషయాలు అంతంత మాత్రమే. ప్రయాణాలు కోరినరీతిలో జరుగవు. వ్యాపారులు ఖాతాదారులతో జాగ్రత్తగా మెలగాలి. భాగస్వాములు మోసగిస్తారు.

వారఫలాలు

తేది 16-4-2011 నుండి 22-4-2011 వరకు మేషంలో రవి; మీనంలో కుజ, బుధ; గురువులు; కుంభ, మీనాల్లో శుక్రుడు; ధనుస్సులో రాహువు; కన్యలో శని; మిథునంలో కేతువు; కన్య, తుల, వృశ్చిక, ధనుస్సుల్లో చంద్రుడు సంచరిస్తారు.

పంచాంగం

16తేదీ మహావీర్ జయంతి, శనిత్రయోదశి.
21తేది సంకటహర చతుర్థి.
22తేది గుడ్‌ఫ్రైడే, గురుమౌఢ్య త్యాగం.

ఏప్రిల్ తిథులు

చైత్ర శుద్ధ

16	శని	త్రయోదశి	ప.1.45	గం.ల.వ
17	ఆది	చతుర్దశి	ప.11.30	గం.ల.వ
18	సోమ	పౌర్ణమి	ఉ.9.58	గం.ల.వ

చైత్ర బహుళ

19	మంగళ	పాడ్యమి	ఉ.6.45	గం.ల.వ
		విదియ	తె.4.10	గం.ల.వ
20	బుధ	తదియ	రా.2.45	గం.ల.వ
21	గురు	చవితి	రా.1.20	గం.ల.వ
22	శుక్ర	పంచమి	రా.11.25	గం.ల.వ

పి.ఎం.గోపాలాచారి
16/1020, పొగతోట, నెల్లూరు – 1.
E-mail:maripmgg@yahoo.com



తుల
చిత్తా 3,4 పా, స్వాతి, విశాఖ 1,2,3 పా

పెద్దగా చెప్పుకో తగ్గ ఆరోగ్యవిషయ లోపాలుండవు. దీర్ఘరోగులకు ఇబ్బందులుండవచ్చు. కళత్రంతో గొడవలుండవచ్చు. ధనవిషయాలలో లోటు లేదు. బుణరూపంలో కూడ ధనప్రాప్తి. భాగస్వాములు మోసగించే అవకాశాలున్నాయి. వ్యాపారులకు పోటీలధికం. పాదాలకు గాయాలు తగిలే అవకాశం. ఉద్యోగులకు ప్రమోషన్ లేదా ఆదాయవృద్ధి ఉండవచ్చు. రాజకీయులకు ఉత్తమకాలం.



వృశ్చికం
విశాఖ 4 పా, అనూరాధ, జేష్ఠ

బంధువుల రాక తృప్తినిస్తుంది. దైవ కార్యాలలో ఎక్కువగా పాలు పంచుకోవాలి. వ్యాపారులకు లాభాలలో కొంత కోత ఏర్పడవచ్చు. నిదానంగా ఖాతాదారుల మనసెరిగి నడచుకోవడం మంచిది. భాగస్వాములతో గొడవలు రాకుండా చూసుకోవాలి. రాజకీయులు లేని పోని గొడవల్లో చిక్కుకొంటారు. ఉద్యోగులకు కొంత మేలు. సరైన ఆలోచనలు మేలు చేస్తాయి. విద్యార్థులకు వృథా కాలక్షేపం.



ధనస్సు
మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా

ఆరోగ్యలోప సూచనలు లేవు. వాహనాలు జాగ్రత్తగా నడపాలి. మిత్రులు సాయమందిస్తారు. పద్ధతి ప్రకారం పనులు నిర్వహిస్తారు. ప్రయాణాలు సుముఖంగా సాగుతాయి. ఆర్థిక లావాదేవీలు మీకు అనుకూలంగా ఉంటాయి. ఇన్నాళ్ళు ఆటంకాలతో అడ్డుపడ్డ పనులు ఊపందుకొంటాయి. నూతన ఉద్యోగావకాశాలు లభించవచ్చు. వ్యాపారులకు ప్రోత్సాహకరమైన వారం. వారసత్వాలు లాభిస్తాయి.



మకరం
ఉత్తరాషాఢ 2, 3,4 పా. శ్రవణం, ధనిష్ఠ 1, 2 పా

పైత్య సంబంధిత బాధలు. ప్రతి అడుగు ఆచితూచి వేయడం మంచిది. అనవసరపు విషయాలలో జోక్యం చేసుకోకుండడం మంచిది. ఆర్థికవిషయాలు కొంత తృప్తికరంగా ఉంటాయి. వ్యాపారులు భాగస్వాములతో సఖ్యంగా ఉండడానికి ప్రయత్నించండి. రాజకీయులు తోటివారి విషయంలో జాగ్రత్తగా ఉండాలి. పైవారిని విమర్శించకుండాలి. విద్యార్థులు చదువు విషయంలో శ్రద్ధ చూపాలి.



కుంభం
ధనిష్ఠ 3,4 పా. శతభిషం, పూర్వ భాద్ర 1,2,3 పా

నూతన మార్గాలలో ధనప్రాప్తి అవకాశాలు. ఆగిన పనులు నిదానంగా సాగుతాయి. ఇతరులతో అభిప్రాయభేదాలు రావచ్చు. వివాహాది శుభకార్యాచరణకు శ్రీకారం చుడతారు. మాట నిలబెట్టుకోవడానికి శ్రమపడతారు. పాదాలకు గాయాలు తగిలే అవకాశం. రాజకీయులకు ఉత్తమకాలం. వ్యాపారులకు మంచి లాభావకాశాలు నూతన భాగస్వామి లభిస్తారు. విద్యార్థులకు శ్రమ.



మీనం
పూర్వాభాద్ర 4 పా, ఉత్తరాభాద్ర, రేవతి

ఒత్తిడి, బి.పి. బాధలు. దాంపత్య సుఖం చక్కగా ఉంటుంది. జీవిత భాగస్వామి బంధువులతో గొడవలుండవచ్చు. వ్యాపారులకు ముందు చూపు చక్కగా పని చేస్తుంది. భాగస్వాములు తోడుగా ఉంటారు. దైనందిన కార్యక్రమాలలో ఆటంకాలుండవచ్చు. విద్యార్థులకు ఒక మోస్తరుగా చదువు సాగుతుంది. దూర ప్రయాణావకాశాలు. కళాకారులకు ఆశాభంగం. ఉద్యోగులకు శ్రమ తగ్గుముఖం పడుతుంది.

ఆశ్చర్యానికి గురిచేస్తున్న ప్రాచీన భారతీయ శాస్త్రాలు!

డాక్టర్ ఐ.వెంకటేశ్వరరావు బెంగుళూరు

** క్రీస్తు పూర్వం, ఆతర్వాత చెప్పిన జ్యోతిష శాస్త్రం ఏవిధంగా గొప్పదంటారు?*

వరాహమిహిరుని ఖగోళ పరిజ్ఞానానికి 'లగద మహర్షి' జ్యోతిష అంచనాలకు, అమెరికన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ముక్కు మీద వేలేసుకుంటున్నారు. మీరొకసారి భారతీయ జ్యోతిష, తత్వవేత్తల ముందు పాశ్చాత్యులు ఏ విధంగా మోకరిల్లుతున్నారో తెలుసుకోవాలంటే జేమ్స్ డబ్ల్యు కలాట్(నార్త్ కెరోలినా యూనివర్శిటీ) 'బయోలాజికల్ సైకాలజీ' గ్రంథం చదివి చూడండి.

జె.ఎన్.పూర్ణిమారెడ్డి చిత్తూరు

** రాహుకేతు పూజా విధానం వల్ల అతను సంపూర్ణ ఆరోగ్యవంతుడయ్యాడు.*

పూజా ప్రభావం కొంత వుండవచ్చు. మెదడులోని 'సెరిటోనిన్' ఉత్పత్తి కేవలం నమ్మకం వల్లే జరుగుతుందని డాక్టర్ జేమ్స్ – డబ్ల్యు – కాలట్ (నార్త్ కరోలినా యూనివర్శిటీ, వాషింగ్టన్) అంటారు. అయితే గ్రహ ప్రభావాల్ని, మంచి ఫలితాల్ని పూర్తిగా కొట్టి పారెయ్యడానికి వీలు లేదు.

చిట్టం శ్రావణి కర్నూలు

** వాస్తు దోషాలున్నాయి. సరిచేసుకోవడానికి కొంత సమయం కావాలి. దక్షిణ వీధిలో తూర్పు యిల్లు కట్టం అసలు సరిదిద్దలేం.*

ఈ పరిస్థితుల్లో సుదర్శన, శీతల, లక్ష్మీగణపతి యంత్ర ప్రతిష్టలు యాభై శాతం దుష్ఫలితాల్ని సరిదిద్దుతాయి.

ఎన్.తిరుమలరెడ్డి జలదంకి

** ఎట్లాంటి గృహాలు కలసిరావు? పరిష్కారం చెప్పండి?*

దేవాలయం, మసీదు, చర్చి, సమాధులు గల చుట్టుక్కల ప్రాంతాల గృహాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా కలసిరావు. సుదర్శన యంత్ర ప్రతిష్ట మేలు చేస్తుంది.

డాక్టర్ కె.అయ్యప్పరెడ్డి అనంతపురం

** కొన్ని జ్యోతిష గ్రంథాల్ని గురించి చెప్పండి?*

జ్యోతిర్నిబంధం, దైవజ్ఞ విలాసం, ముహూర్త దర్పణం, ముహూర్త మార్తాండం, మాండవ్య వచనం, స్మృతివాక్యం, జ్యోతిష ప్రకాశిక ఇలా మొత్తం 14 జ్యోతిష గ్రంథాలున్నాయి.

షేక్ లతీఫ్ తోటపల్లి గూడూరు

** తూర్పు యింటికి(అతిథి గృహం) దక్షిణం వైపు రొయ్యల గుంటలున్నాయి.*

ఏ దిశ ఇల్లైనా ఇంటిని ఆనుకొని గుంతలు(అగాధాలు) వుండకూడదు. జల దోషం వల్ల శ్వాసకోశ సంబంధిత వ్యాధులు కలుగుతాయి.

వాస్తు సందేహాలు సమాధానాలు

ఆచార్య సుబ్రహ్మణ్య మహర్షి
4వ వీధి, గాయత్రినగర్, ఎ.కె. నగర్ పోస్టు, నెల్లూరు-4.
ఫోన్: 2322345, సెల్: 9490125878.

టి.ఎన్.కె నెల్లూరు

** మా అబ్బాయిది చిత్త నక్షత్రం, అమ్మాయిది అశ్వని నాలుగవ పాదం. ఆమె వల్లే మా యింట్లో కష్టాలు ప్రారంభమయ్యాయి.*

మీకు ధైర్యం వుంటే పూర్తి పేరు రాసి వుండేవారు. అమ్మాయిది అశ్వని దేవగణం, అబ్బాయిది రాక్షస గణం పులి. ఈ మాత్రమైనా బతుకుతున్నారు. రాక్షసగణం పులివస్తే దుష్టప్రవృత్తి ఎక్కువ. అబ్బాయి నక్షత్రమే దుష్ట నక్షత్రం.

పి.అరవిందారెడ్డి బెంగుళూరు

** స్థిరమైన నివాస యోగ్యత వుండటం లేదు. కుమారుడు కూడా మాట వినడం లేదు.*

గృహాలు బాడుగ ఇళ్లు అయినపుడు వాస్తు దోషాలున్నాయో లేదో చూపించి తీసుకోవాలి. యంత్ర ప్రతిష్ట తప్పక చేసుకోవాలి. జన్మ తేదిని బట్టి 'గ్రహయుక్తం'గా దిశా గృహాల్ని ఎంపిక చేసుకోవడం మంచిది.

ఎ.బలభద్రయ్య నాయుడుపేట

** దీర్ఘచతురస్ర స్థలాలు మంచివేనా?*

ఎదురు కొలతలు సమానంగా వున్న భూమిని దీర్ఘ చతురస్ర స్థలం అంటారు. ఇందులో ఖర్చు ఎక్కువ. పశువులకు హాని జరుగుతుందని 'వాస్తు విద్య' గ్రంథం చెబుతోంది!

ఎన్.వి.ఆర్ నెల్లూరు

** మా యింటి దగ్గర రోడ్డు మలుపు తిరిగింది. వెనుక యింటి గోడమూల మా యింటికి తగులుతున్నది.*

మలుపు వల్ల వీధిపోటు, గోడ కోణం వల్ల కోణవేధ కలుగుతాయి. వెంటనే ఖాళీ చేయడం మంచిది.

పంచాయితీరాజ్‌శాఖ అధికారుల పనితీరుపై

జడ్పీ సమావేశంలో చర్చ!

పంచాయితీరాజ్ శాఖ ఎస్ఇ తాను ప్రభుత్వ అధికారినన్న సంగతి మరచిపోయి ఫక్తు రాజకీయ నాయకుడిలా ప్రవర్తిస్తూ ఈ మధ్య తరచూ వివాదాస్పదమవుతున్నాడు.



జడ్పీ సమావేశంలో ప్రోటోకాల్ వ్యవహారంపై నిరసన తెలియజేస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న, జడ్పీటీసిలు రమణయ్య, చలపతి, వెంకయ్య తదితరులు.

ఇటీవల జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ముందుగా వూహించిన విధంగానే కొత్త మలుపు తిరిగింది. వైఎస్ జగన్ వర్గం జడ్పీటీసి సభ్యులు ప్రొటోకాల్ వివాదంపై పెద్ద రగడ చేశారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఈ అంశంపై సమావేశం ప్రారంభ దశలోనే చర్చ సాగాలని పట్టుబట్టారు. అజెండాలోని అంశాలను చర్చించిన అనంతరం ప్రోటోకాల్ వివాదంపై చర్చకు అనుమతిస్తామని జడ్పీ ఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పినప్పటికీ సభ్యులు అందుకు అంగీకరించలేదు. కొడవలూరు మండలం వెంకన్నపురంలో ఈ నెల 4వ తేది జరిగిన అధికారిక కార్యక్రమంలో ఏర్పాటుచేసిన శిలాఫలకంలో జడ్పీఛైర్మన్, స్థానిక ఎమ్మెల్యేలకు అవమానం జరిగింది. ఈ శిలాఫలకంలో మంత్రులు పేర్లు వేయలేదన్న ఉద్దేశంతో శిలాఫలకాన్ని ప్రతిష్టించకుండా అధికారులు దాచి పెట్టారన్నది ఎమ్మెల్యే ప్రసన్న ప్రధాన ఆరోపణ. ఇందుకు బాధ్యులైన పంచాయితీ రాజ్ ఇంజనీర్లను సస్పెండ్ చేయాలని ప్రసన్న డిమాండ్ చేశారు.

జిల్లాలో ఎప్పటి నుంచో ప్రొటోకాల్ వివాదం వుంది. గతంలో ప్రొటోకాల్ పాటించడం లేదంటూ కొందరు ప్రజాప్రతినిధులు జడ్పీ సమావేశం సందర్భంగా ఫిర్యాదులు కూడా చేయడం జరిగింది. అయితే ఇప్పటివరకు ప్రొటోకాల్ అమలు చేయని ఒక్క అధికారిపై కూడా ఎటువంటి చర్యలు తీసుకొన్న దాఖలాల్లేవు. జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఇదే అంశంపై దాదాపు గంటకుపైగా జగన్‌వర్గం సభ్యులు బైఠాయించి అధికారులను సమావేశానికి పిలిపించాలని గట్టిగా పట్టుబట్టారు. పంచాయితీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ హైదరాబాద్ వెళ్లడంతో డిఇ వచ్చి క్షమాపణ చెప్పారు.

ఎస్ఇ తన పరిధికి మించి ప్రవర్తిస్తున్నారని జడ్పీఛైర్మన్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందుకు ఉదాహరణగా జడ్పీ నూతనభవన నిర్మాణంలో ఎస్ఇ వ్యవహరించిన తీరును వివరించారు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులకు గుర్తింపు కార్డులు వుండాలని ఆయన చెప్పడం ఇప్పటికే వివాదంగా మారింది. ఎస్ఇ వైఖరి కారణంగా జిల్లాపరిషత్ హైకోర్టు వరకు వెళ్లాల్సి వచ్చింది. సర్వసభ్య సమావేశానికి హాజరైతే ఎక్కడ సభ్యుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందో నని భయపడి ఆయన కార్యాలయ పని మీద హైదరాబాద్ వెళ్లారు.

జడ్పీటీసీలు, ఎంపీపీలు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం తరపున వివరణ ఇవ్వాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్‌పై వుంటుంది. కలెక్టర్ సైతం ఈనెల 7వ తేది జరిగిన సమావేశానికి హాజరు కాలేదు. జిల్లా కలెక్టర్‌కు బదులు జాయింట్ కలెక్టర్ సౌరభ్‌గౌర్ హాజరైనప్పటికి సభ్యుల ప్రశ్నలకు సరైన వివరణ ఇవ్వలేకపోయారు. ఒక సందర్భంలో జిల్లా కలెక్టర్‌ను పంచాయితీరాజ్ ఎస్ఇని సమావేశానికి పిలిపించాలని జగన్ వర్గం జడ్పీటీసీలు పట్టు పట్టారు. పంచాయితీరాజ్ ఆధ్వర్యంలో జరిగిన పనులు, బిల్లుల చెల్లింపులకు సంబంధించి అవినీతి, అక్రమాలు జరిగాయని దానిపై అవినీతి నిరోధకశాఖకు ఫిర్యాదు చేసి విచారణ జరిపిస్తామని జడ్పీ ఛైర్మన్ హామీ ఇచ్చారు.

గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ ప్రొటోకాల్ వివాదం జిల్లాలో ఎప్పటి నుంచో వుందని దీనిపై తాను అసెంబ్లీ స్పీకర్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకునే దిక్కులేకుండా పోయారని విచారం వ్యక్తం చేశారు. కోర్టుకు వెళ్లినా కూడా తీర్పు వెలువడే లోపల ప్రజాప్రతినిధుల కాలపరిమితి తీరిపోతుందని వ్యాఖ్యానించారు.

ఈ దఫా జరిగిన సర్వసభ్య సమావేశంలో సభ్యుల హాజరు పలుచనగా కనిపించింది. అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు గైర్హాజరు కాగా తెలుగుదేశం పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు బీద మస్తాన్‌రావు, పరసారత్నం, కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు నగర ఎమ్మెల్యే శ్రీధర్‌కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తదితరులు హాజరైనారు.

సమావేశం అజెండాలో తెలుగుదేశం, వైఎస్ జగన్‌వర్గం సభ్యులు వివిధ అంశాలపై మాట్లాడారు. ఈ సంవత్సరం జూన్‌కు జడ్పీ పాలకవర్గం కాలపరిమితి ముగుస్తుంది. మరోసారి సర్వసభ్య సమావేశం జరిగే అవకాశం కనిపించడం లేదు.

సరికొత్త నిర్ణయం

పట్టాదారు పాసు పుస్తకాల జారీ అధికారం ఆర్డీఓలకు అప్పగింత!

తహశీల్దార్లు జారీ చేస్తున్న పట్టాదారు పాసు పుస్తకాల వ్యవహారం వివాదాస్పదంగా మారడంతో ప్రభుత్వం ఈ సరికొత్త నిర్ణయం తీసుకొంది.

భూమి హక్కులకు సంబంధించి రెవెన్యూ శాఖ జారీ చేసే పట్టాదారు పాసు పుస్తకాలు ఇక నుంచి రెవెన్యూ డివిజన్ అధికారులు జారీ చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాగులో వున్న భూముల వివరాలు, వివాదాలను పరిష్కరించడంతోపాటు పాసు పుస్తకాలు జారీ చేస్తారు. ఇప్పటివరకు మండల తహశీల్దార్లు పట్టాదారు పాసు పుస్తకాలు అందజేసేవారు.

గ్రామాల వారీగా భూముల వివరాలు సేకరించి వివాదాస్పదంగా వున్న భూములకు సైతం తహశీల్దార్లు పాసు పుస్తకాలు ఇచ్చిన సందర్భాలున్నాయి. కొన్ని సందర్భాలలో పాసు పుస్తకాల జారీ వివాదాస్పదంగామారి కోర్టుల వరకు వెళ్తున్నాయి. రెవెన్యూ సిబ్బంది, అధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడడంపై రాష్ట్ర ప్రభుత్వానికి అనేక ఫిర్యాదులు అందడంతో పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేసే అధికారం ఆర్డీఓలకే అప్పగించాలని నిర్ణయించింది. మండల తహశీల్దార్‌లు ప్రతిపాదనలు పంపడం వరకే పరిమితం కావాల్సి వుంటుంది.

రెవెన్యూ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఎటువంటి విచారణ చేయకుండానే పాసు పుస్తకాలు ఇచ్చేస్తున్నారు. సంవత్సరాల తరబడి పేదలు సాగు చేసుకొంటున్న వ్యవసాయ భూములకు మాత్రం ఎటువంటి దృవీకరణ పత్రాలు జారీ చేయడం లేదు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా జిల్లాలో వేలాది ఎకరాలు వివాదాస్పదంగా మారి సాగుకు నోచుకోకుండా వున్నాయి. కొందరు విఆర్వోలు నెల్లూరు, కావలి పట్టణాల్లోని లాడ్జీల్లో మకాం వేసి పాసు పుస్తకాల వివరాలు నమోదు చేస్తున్నారు.

రాష్ట్రప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం మేరకు ఆర్డీఓలు పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తే అక్రమాలు కొంతమేరకు నియంత్రించవచ్చున్నది ప్రభుత్వ అభిప్రాయం. పాసు పుస్తకాలు కావాల్సిన రైతులు నేరుగాగాని, స్థానిక తహశీల్దార్ ద్వారాగాని ఆర్డీఓకు దరఖాస్తు చేసుకోవచ్చు. రైతులకు చెందిన భూముల వివరాలను తన కార్యాలయానికి తెప్పించుకొని సిబ్బంది చేత నమోదు చేయించి రైతులకు అందజేస్తారు. ఆర్డీఓలకు అధికారం అప్పగించడంతో మండల తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది అక్రమ సంపాదనకు కొంతమేర గండిపడుతుంది.

ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో పాసు పుస్తకాల జారీకి సంబంధించి కొన్ని సవరణలు చేశారు. ఆర్డీఓలు ఎప్పటి నుంచి పట్టాదారు పాసు పుస్తకాలు జారీ చేస్తారన్న విషయం మాత్రం ప్రకటించడం లేదు. ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం ఏ మేరకు ఫలితాలు సాధిస్తుందో వేచి చూడాలి.

మహాబోరు మంచివాడు!



✍ అల్లూరు రహీం

సూపర్ గుడ్ ఫిలిమ్స్ పతాకమంటే సినీ పరిశ్రమ, ప్రేక్షకులలో ప్రత్యేక గుర్తింపు వుంది. దీనికి కారణం గతంలో ఈ బ్యానర్‌పై వచ్చిన రాజా, సూర్యవంశం, సుస్వాగతం, శుభాకాంక్షలు వంటి కుటుంబ కథా చిత్రాలు. అటువంటి బ్యానర్‌పై తనీష్, భానులను హీరో, హీరోయిన్లుగా పెట్టి ప్రేమకథా చిత్రమంటూ తీసిన 'మంచివాడు' పరమచెత్తగా వుంది. ఒక అమ్మాయి ప్రేమను పొందడం కోసం హీరో ఎన్నో అబద్ధాలు చెబుతాడు. కాని చివరకు అతని ప్రేమ సఫలం కాదు. హీరోయిన్ ప్రేమ పొందడం కోసం హీరో వేసే ఎత్తుగడలు పరమ పేలవంగా వున్నాయి. దీనికి తోడు గురుశిష్యుల సంవాదం మాదిరి తరచూ తెరపై తనీష్, రఘుబాబులు ప్రత్యక్షమైపోతుంటారు. వీరిద్దరి మధ్య చెత్తమాటలు, చెత్త వ్యవహారాలు. వీటిని చూసి హీరోయిన్ మనసు కరిగిపోతున్నట్లు దర్శకుడు తెరపై చూపిస్తుంటాడు. కాని అంతిమంగా ఆమె మరొకరిని ప్రేమించడంతో సినిమా పలచనపడిపోతుంది. గ్రామంలో ఆవారాగా తిరుగుతూ మహా తెలివిగా వ్యవహరిస్తుండే హీరో తన గురువుతో కలసి కలెక్టరేట్‌కు వెళ్ళి కలెక్టర్ వుద్యోగాన్ని కొన్నాళ్లు అడగడమేమిటో అర్థమే కాదు. ఈ చిత్రానికి గతంలో సునీల్‌తో అందాల రాముడు తీసిన లక్ష్మీనారాయణ కథ, స్క్రీన్‌ప్లే తోపాటు దర్శకత్వ బాధ్యతలు నెరవేర్చాడు. తలతోకాలేని సన్నివేశాలతో ఆయన ప్రేక్షకుల సహనానికి పరీక్ష పెట్టాడు. కుటుంబ కథా చిత్రం అంటూ ప్రచారం చేసుకొన్న ఈ సినిమాలో సెకండ్ హీరోయిన్ సైకిల్ తొక్కి తొక్కి... ఐస్‌ఫ్రూట్ నాకి నాకి వంటి బూతు మాటలు నొక్కి వల్లిస్తుంది. పైట్స్ ఆపరేషన్‌పై సెటైర్ అసహ్యంగా వుంది. మంచివాడులో చెప్పుకోవాల్సింది తమిళ సంగీత దర్శకుడు శిల్పి అందించిన సంగీతం. మెలోడిబీట్స్‌తో సాగే చిరుగాలి పల్లకిలో, ఏదీ వెన్నెల, మళ్లీ మళ్లీ రాని, అనగనగా ఓ చిన్నది చరణాలతో సాగే పాటలు బాగున్నాయి. కాని ఏ పాట చిత్రీకరణా దర్శకునికి చేతకాలేదు. దర్శక దిగ్గజం కె.విశ్వనాథ్ వంటి వారి చేత ఓ తాతయ్య పాత్రలో నటనను రాబట్టడంలో పూర్తిగా విఫలమయ్యాడు. హీరో తనీష్‌కు ముఖాన భావాలు పలకవు. కొత్త హీరోయిన్ భాను సంగతి చెప్పనక్కరలేదు. గంగోత్రి విశ్వనాథ్ వ్రాసిన మాటల్లో ప్రేమమయపు డైలాగులు తక్కువ. అయితే చెడు దగ్గర మంచిని వెతుక్కోవడం దుర్మార్గం. అర్హతకు మించి కోరుకోకూడదు. మాటలను మార్చగలం... మనసును మార్చగలమా? ఆలోచింపజేస్తాయి.

చిత్ర సమీక్ష

చిత్రకథలోనికి వెళ్తే రిటైర్డ్ కలెక్టర్ దశరథరామయ్య (కె.విశ్వనాథ్) మనవడు రాజా (తనీష్) చదువు సంధ్య లేక గ్రామంలో ఆవారాగా తిరుగుతుంటాడు. అతనికి నానమ్మ జానకి (జయంతి) తోపాటు కుటుంబ సభ్యులంతా మద్దతుగా వుంటారు. ఇంతలో అమెరికా నుంచి ఎంటెక్ చదివిన మేనత్త కూతురు ఇందు (భాను) వస్తుంది. ఈమె ప్రేమ పొందడం కోసం హీరో తన గురువు అంజి (రఘుబాబు) సలహాలతో పలు నాటకాలు ఆడుతాడు. తనకు గతంలో ఓ ప్రేయసి వుండేదని, ఆమె తనను మోసగించినా వేరొకరితో ఆమె పెళ్లికి సహకరించానని ఓ విషాద ప్రేమకథ ఆమెకు చెబుతాడు. ఈ కథ విన్న ఇందు రాజాను ప్రేమిస్తున్నట్లు కనపడుతూ రమేష్‌కు ఐ లవ్‌యూ చెబుతుంది. ఇది చూసి రాజా డస్సిపోతాడు. దగ్గరగా మసలుతున్న రాజా, ఇందులకు పెళ్లి చేయాలనుకొంటాడు దశరథరామయ్య. రమేష్‌ను ఆమె ప్రేమిస్తుండడంతో అది తాతకు చెప్పలేక నేను చేసుకోనంటాడు. ఇది జరిగాక ఇంట్లో పెద్ద గొడవ. అంతిమంగా దశరథరామయ్య నిజం తెలుసుకొని ఇందు రమేష్‌ల పెళ్లి చేస్తాడు. సినిమా చివరి సన్నివేశంలో రాజాను రెండవ తరగతిలో పెళ్లి చేసుకొంటావా అని అడిగే సోనియా వచ్చి ఐలవ్‌యూ చెప్పడంతో కథ సుఖాంతమవుతుంది. బాగా ఓపిక వున్నవారు మినహా కాలక్షేపానికి ఈ సినిమాకు వెళ్తే ఇక అంతే సంగతులు.

ఐదేళ్లు పెళ్లి చేసుకోను!



బొద్దుగా వుండి ఇటు తెలుగు, తమిళ ప్రేక్షకులను ఆకర్షించే హీరోయిన్ నమిత. ఇటీవల కొత్త వ్యాపారం మొదలుపెట్టింది. జ్యూయెలరీ డిజైనింగ్‌పై దృష్టి పెట్టిన ఆమె దీనికి సంబంధించిన గ్రౌండ్‌వర్క్ మొత్తం పూర్తి చేశానంటుంది. షాపు తెరవడమే తరువాయి అంటుంది. సినిమాలు, వ్యాపారమేనా పెళ్లెప్పుడు అంటే; ఇంకా ఐదారేళ్లు నేను హీరోయిన్‌గా కొనసాగగలను. దక్షిణాదిన అన్ని భాషల నుంచి అవకాశాలొస్తున్నాయి. వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన తరుణమిది. ఇక ఐదేళ్ల వరకు పెళ్లి ఆలోచనలు చేయను. పెళ్లిళ్లు స్వర్గంలో నిశ్చయమవుతాయంటారు. నాకు ఎక్కడో జతకుదిరే వుంటుందని నమిత చమత్కరించింది.

రాఖీ... ఎందుకిలా?




ఐటమ్‌గాళ్ రాఖీసావంత్ ఈ మధ్య వచ్చిన ఓ హాలీవుడ్ అవకాశాన్ని తిరస్కరించింది. ఎందుకిలా చేశావని బాలీవుడ్ జనాలు ప్రశ్నిస్తే రొమాన్స్ శృతి మించిన సన్నివేశాల్లో నటించడం తనకు ఇష్టం లేదనీ, అందుకే ఆ అవకాశం వదలుకొన్నానంది. పాత్రికేయులు బాలీవుడ్‌లో సెక్స్ టీచర్‌గా ఓ సినిమాలో నటిస్తున్నావు కదా.. దాని సంగతేంటని ప్రశ్నిస్తే బాలీవుడ్‌కీ హాలీవుడ్‌కీ చాలా తేడా వుంది. బాలీవుడ్‌లో ఓవర్ ఎక్స్‌పోజింగ్ చేస్తే సెన్సార్ వుంటుంది. హాలీవుడ్‌లో సెన్సార్ వుండదుగా అని చెప్పుకొచ్చింది. నాలుగుకోట్ల రూపాయల పారితోషికం ఆ హాలీవుడ్ సినిమా కోసం తనకు ఆఫర్ చేశారని, డబ్బుకోసం తాను కక్కుర్తి పడలేదని రాఖీసావంత్ చెబుతుంటే ఇదంతా వట్టిదేనని బాలీవుడ్ జనం కొట్టి పారేస్తున్నారు.

మౌనవ్రతం



విల్లు చిత్రంలో నయనతార నటిస్తుండగా దర్శకుడు ప్రభుదేవాతో ఆమె ప్రేమ విరబూసింది. మూడు నెలల క్రితం వరకు దాదాపుగా ప్రతిరోజూ పత్రికలకు, వెబ్‌సైట్లకు ఛానల్స్‌కు ఎక్కిందావిడ. ప్రభుదేవా అయితే ఆమెను పెళ్లి చేసుకోను తాను ఇన్నాళ్లుగా సంపాదించిన ఆస్తి మొత్తం తన భార్యా పిల్లలకు రాసిచ్చేశాడు. ఇల్లరికపు అల్లుడిగా నయనతారతో వెళ్లిపోను సిద్ధపడ్డాడు. అటువంటి ఈ ప్రేమజంట ప్రస్తుతం నోరు మెదపడం లేదు. నయనతార ప్రస్తుతం బాలకృష్ణ సరసన 'శ్రీరామరాజ్యం' చిత్రంలో నటిస్తూ బిజీగా వుంది. అలాగే తమిళంలో విశాల్ చిత్రానికి ప్రభుదేవా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రెండు చిత్రాలు పూర్తయ్యాక వీరు పెళ్లి కబురు చెప్పొచ్చంటున్నారు.

భామల మధ్య బురద!



బాలీవుడ్ హీరోయిన్లు కరీనాకపూర్– ప్రియాంక చోప్రాల మధ్య గత కొంతకాలంగా జరుగుతున్న యుద్ధం ఇప్పుడు వేడెక్కింది. ఒకరంటే ఒకరికి ఏమాత్రం పొసగడం లేదు. ఒకరిపై ఒకరు బురద చల్లుకోవడమే పనిగా పెట్టుకున్నారు. దీనికి కారణం ఎవరో కాదు; తొలుత కరీనా కపూర్‌తోనూ, ఇప్పుడు ప్రియాంకా చోప్రాతోనూ ఎఫైర్ నడుపుతున్న షాహిద్ కపూర్. తాను వదలేసిన షాహిద్‌ను ప్రియాంక అక్కున చేర్చుకోవడం కరీనాకు ఇష్టం లేదు. ఇది మనసులో పెట్టుకొని ప్రియాంక చోప్రా నటిస్తుండగా ఎప్పుడూ చూడలేదంటూ వివాదానికి తెర లేపింది కరీనా. ఈ విషయమై ప్రియాంక మాట్లాడుతూ కరీనా మాత్రం మంచి నటి అని నేనొప్పుకొంటానంది. అంతటితో ఆగక మాట్లాడే ముందు సంస్కారం వుండాలి. ఆ సంస్కారం నాకుంది. బహుశా అది కరీనాకి లోపం కావొచ్చని ప్రియాంక తనదైన శైలిలో చెప్పుకొచ్చింది. దీంతో ప్రియాంక – షాహిద్‌ల ఎఫైర్‌పై నానా మాటలు సంధించింది కరీనా. నా గూర్చి మాట్లాడేటప్పుడు సైఫ్‌తో కరీనా ఏం చేస్తుందో బహిరంగంగా చెప్పాలని సవాల్ విసిరింది చోప్రా. మొత్తం మీద భామలిద్దరూ బురద చల్లుకోవడమే పనిగా పెట్టుకొని జనానికి మంచి కాలక్షేపం ఇస్తున్నారు.



శిలాఫలకాల్లో పేర్ల కోసం రగడ



విలేకరులతో మాట్లాడుతున్న సోమిరెడ్డి.

జిల్లాలోని నాయకులంతా ప్రజా సమస్యలను గాలికొదిలేసి శిలాఫలకాల్లో పేర్ల కోసం కొట్టుకొంటున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తమ పార్టీకి చెందిన జడ్పీటీసి సభ్యులకు సరైన సమాచారం ఇవ్వకుండా జడ్పీ కార్యాలయాన్ని ప్రారంభించడం ప్రజాప్రతినిధులను అవమానించడమేనన్నారు. పొదలకూరు ప్రాంతంలో ప్రతి శిలాఫలకంలో జడ్పీ ఛైర్మన్ పేరే ప్రముఖంగా కన్పిస్తుందని విమర్శించారు. జిల్లాపరిషత్ కార్యాలయం నూతన భవనానికి నల్లపురెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేరు పెట్టకుండా ప్రారంభించడం దారుణమన్నారు. గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌ను తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలోనికి ప్రవేశించకుండా అడ్డుకోవడం దారుణమన్నారు. దీనికి కారకులైన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు

జిల్లాలో పదవ తరగతి పరీక్షలు మొత్తం మీద ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకొన్నారు. మార్చి 24వ తేది నుంచి ఏప్రెల్ 7వ తేదీ వరకు జరిగిన ఈ పరీక్షలను 35 వేల మంది విద్యార్థినీ, విద్యార్థులు వ్రాశారు. కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే డిబార్‌కాగా మాల్ ప్రాక్టీసుకు సహకరించారని 11 మంది ఉపాధ్యాయులను సస్పెండ్ చేయడం విశేషం. పరీక్షల పకడ్బందీ నిర్వహణలో 16 ఫ్లెయింగ్ స్క్వాడ్లు, 360 మంది సిట్టింగ్ స్క్వాడ్లు విధులు నిర్వహించాయి. 180 మంది డిపార్ట్‌మెంటల్ ఉద్యోగులు, 1800 మంది ఇన్విజిలేటర్లు పరీక్షల నిర్వహణలో పాలు పంచుకొన్నారు. హిందీ, ఇంగ్లీషు ప్రశ్నాపత్రాల్లో కాస్త తేడా కన్పించడంతో విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. 7వ తేది పరీక్షలు ముగియడంతో పిల్లలు సంతోషంతో కేరింతలు కొడుతూ పరీక్షా కేంద్రాల నుంచి బయటకు వచ్చారు. పరీక్షా కేంద్రాల్లో కనీస సౌకర్యాలు లేవన్న పలు విమర్శల నేపథ్యంలో డిఇఓ పరీక్షలను ఏదోలా నిర్వహించి బయటపడ్డాడు.

మాల్ ప్రాక్టీస్‌కు సహకరించిన అయ్యోర్లు

ఆశ వర్కర్ల ధర్నా

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ వారికండగా నిలుస్తున్న ఆశ కార్యకర్తల సమస్యలను పట్టించుకునే వారు కరువయ్యారని ఏపి వాలంటరీ హెల్త్ వర్కర్స్ యూనియన్(ఆశ) జిల్లా కార్యదర్శి రెహనా ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలంటూ ఆశ కార్యకర్తలు వైద్య ఆరోగ్య శాఖాధికారి జిల్లా కార్యాలయం వద్ద రెండు రోజుల పాటు ధర్నాను నిర్వహించారు. రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కార్యాలయం దగ్గరే వంటా వార్పు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిఓ నెం.3ను అమలు చేయడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నారన్నారు. ఆశ వర్కర్స్‌కు సంబంధించిన కాగితాలపై సర్పంచ్‌లు సంతకాలు పెట్టకుండా వేధించడం దారుణమన్నారు. ధర్నాను ఉద్దేశించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకట రమణారెడ్డి స్పందిస్తూ జాయింట్ సమావేశాన్ని నిర్వహించి ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మహిళా సంఘాలకు చెందిన నాయకురాళ్లు కె.విజయమ్మ, కె.లక్ష్మి, షేక్ షాహినాబేగం తదితరులు పాల్గొన్నారు.



డిఎమ్‌అండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట వంటవార్పుతో నిరసన.

యదేచ్ఛగా కవర్ల వాడకం

నగరంలో పాలిథిన్ కవర్ల వినియోగంపై అధికారులు తీసుకొంటున్న చర్యలు అభాసుపాలవుతున్నాయి. పర్యావరణానికి హాని కల్గించే పాలిథిన్ కవర్ల వాడకంలో మునిసిపల్ అధికారులు కొన్ని కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చారు. 40 మైక్రాన్ల కంటే తక్కువ సామర్థ్యం గల కవర్లను వినియోగించరాదన్నారు. వ్యాపారస్తులు అలాంటి కవర్లను వినియోగదారులకు ఇవ్వకూడదని, ఎక్కడైనా ఈ నిబంధనలను అతిక్రమిస్తే పెద్ద



కవర్లను కట్టడి చేయడంలో విఫలం.

మొత్తంలో జరిమానా విధిస్తామన్నారు. హెచ్చరికలు, అధికారుల చర్యలు ఆరంభ శూరత్వంగా మారాయి. చిన్న చిన్న వ్యాపారులు అధికారులు దెబ్బకు భయపడి అసలు కవర్లు ఇవ్వడమే మానివేయగా, పెద్ద పెద్ద షాపింగ్ మాల్స్, సూపర్ మార్కెట్లలో మాత్రం ఇవి అమలు కావడం లేదు. 40 మైక్రాన్ల కంటే తక్కువుండే కవర్లనే వీరు ఇప్పటికీ వినియోగిస్తున్నారు. నగరంలో పేరొందిన సూపర్ మార్కెట్లలో 20 మైక్రాన్ల కవర్లు వాడుతున్నా అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఈ విధానానికి తూట్లు పడుతున్నాయి. చిన్నబజారు, పెద్దబజారులలో కొందరు వ్యాపారులు మాత్రం పేపర్ బ్యాగ్స్‌ను వాడుతూ ఆ ధరను వినియోగదారుల నుంచి వసూలు చేస్తున్నారు. మొత్తం మీద పాలిథిన్ కవర్ల వాడకంలో అధికారులే నిబంధనలకు తూట్లు పొడుస్తుండడంతో నవ్వుల పాలవుతోంది.

సన్నీ హైట్స్‌లో సకల సౌకర్యాలు



నగరానికి వచ్చే అతిథులకు అన్ని సౌకర్యాలతో కూడిన వసతి సదుపాయాలను కల్పిస్తున్నట్లు సన్నీ హైట్స్ హోటల్ ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ సి.కె.షాజీ తెలిపారు. హోటల్ అధునాతన సౌకర్యాలను జనరల్ మేనేజర్ సమీర్‌తో కలసి ఆయన వివరించారు. నగరంలో ఇంతవరకు ఏ హోటల్‌లో లేనివిధంగా యుఎస్ఏ స్టైల్‌లో సెన్సార్ లైట్లు, ట్యాప్‌లను ఏర్పాటు చేశామన్నారు. 106 ఎసి రూములు గల హోటల్‌లో స్టాండర్డ్, ఎగ్జిక్యూటివ్, జూనియర్ సూట్, పెంట్ హౌస్ సూట్‌లు అందుబాటులో వున్నాయన్నారు. విభిన్న రుచులను ఆస్వాదించేందుకు వీలుగా వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ ఆహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. వెజిటేరియన్ లంచ్ బఫేను 199 రూపాయలకు, నాన్ వెజ్ బఫేను 299 రూపాయలకు ఇవ్వడం తమ ప్రత్యేకతన్నారు. పెళ్లిళ్లు, వివిధ పంక్షన్లకు వీలుగా సన్‌షైన్ పేరుతో ఫంక్షన్ హాలు అన్నీ సౌకర్యాలతో అందుబాటులో వుందన్నారు. 1500 మంది కుర్చొనే వీలుందన్నారు. కేఫ్ క్రీమ్ పేరుతో స్నూప్స్ తదితర ఐస్‌క్రీములు, చాట్, కాఫీ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. మద్యపాన ప్రియుల కోసం స్పాట్‌బార్, బార్ బీక్యూ99 పేర్లతో రెండు బార్‌లు ప్రారంభించినట్లు చెప్పారు. అందరికీ అందుబాటులో వుండే ధరలతో అన్ని సౌకర్యాలను అందిస్తున్నామన్నారు.

ఆన్‌లైన్‌లో ఐసిడిఎస్ అధికారుల పనితీరు!

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారుల పని విధానం ఇక నుంచి ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నారు. ఈ మేరకు ఈ శాఖ డైరక్టర్ ఉషారాణి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పథకాలకు ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా సరైన పర్యవేక్షణ, తనిఖీలు లేకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడం లేదు. ప్రాంతీయ సంచాలకుల ప్రాజెక్ట్ డైరక్టర్, సిడిపిఓలు, సూపర్‌వైజర్లు రోజువారి తనిఖీలు చేసి అదే రోజు ఆన్‌లైన్ ద్వారా ఆ శాఖ డైరక్టర్‌కు పంపించే విధంగా చర్యలు చేపట్టింది. ఈ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా పనిచేయడం లేదన్న ఫిర్యాదులు అనేకం వున్నాయి. ఇప్పటి వరకు కేంద్రాల తనిఖీ పేరు చెప్పి సొంత పనులు చక్కబెట్టుకుంటున్నసిడిపిఓలు, సూపర్‌వైజర్లు ఇక నుంచి ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వారు చేపట్టిన కార్యక్రమాలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరచాల్సి వుంటుంది. ఇలా చేయడం వల్ల అధికారులు పారదర్శకంగా విధులు నిర్వహిస్తారన్నది ప్రభుత్వ అభిప్రాయం. ఈ ఆన్‌లైన్ పని విధానం ఏ మేరకు ఫలితాలు సాధిస్తుందో వేచి చూడాలి.



ఐసిడిఎస్ కార్యాలయం పనితీరు మారనుంది.



వాశిలి వాస్తవ్యుడు స్వర్గీయ సుందరబాలయ్య మనుమడు వాశిలి నవీన్‌కుమార్, లక్ష్మీ రమ్యల వివాహం మార్చి 20వ తేది విజయవాడలోని కాళేపల్లి పాండురంగారావు కళ్యాణ మండపంలో జరిగింది.

కాంగ్రెస్ చెలగాటం

మొదటి పేజీ కొరవ

చేసి, తన తండ్రికి చెప్పి టిక్కెట్ ఇప్పించి, గెలిపించాడట. నేను రాజకీయాలలోకి తెచ్చిన మనిషి, నన్ను వదలి పోవడానికి లేదని శాసించాడు జగన్. ఇంతకాలం ఆయన భయానికి అణిగిమణిగి వుండిన ఆమెను, డిఎల్.రవీంద్రరెడ్డి తన వైపుకు తిప్పుకొన్నాడు. జగన్ నుంచి ఏ సమస్య వచ్చినా నేను న్నానని చెప్పడంతో పాటు, ముఖ్యమంత్రి ద్వారా ఆమె కోరికలు తీర్చే హామీ ఇప్పించడంతో, చెప్పా పెట్టకుండా జగన్ శిబిరం వదలి వెళ్లి పోయారామె.

కోడూరు ఎమ్మెల్యే శ్రీనివాసులును కూడా ఇదే తీరులో తన వైపుకు లాక్కొన్నాడు డిఎల్. కేంద్ర మంత్రి సాయి ప్రతాప్ ఇందులో కీలకపాత్ర పోషించాడట. ఎన్నికల సమయంలో జగన్ పక్షం నుంచి ఇద్దరు ఎస్సి వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పక్కన నిలబడడం జగన్‌ను నైతికంగా దెబ్బతీయడానికి పనికి వస్తుందన్నది డిఎల్ వ్యూహం.

ఎన్నికల తర్వాత జైలుకే

ఆ ఇద్దరు ఎమ్మెల్యేలను కానీ, పలువురు మండల స్థాయి నేతలను కానీ తన పక్షం ఆకర్షించడానికి డిఎల్.రవీంద్రరెడ్డి ప్రయోగిస్తున్న మంత్రం – ఎన్నికల తర్వాత జగన్ జైలుకు వెళ్తాడన్న ప్రచారం. జగన్ మీద లెక్కలేనన్ని కేసులున్నాయని, వేల కోట్ల రూపాయలను విదేశాలకు పంపి, తన కంపెనీలలో పెట్టుబడులుగా తిరిగి తెప్పించే ప్రక్రియలో ఆయన ఆర్థిక నేర చట్టాలను అతిక్రమించాడని, ఎన్నికలు కాగానే వాటిని వెలికి తెచ్చి కేసులు పెట్టడానికి కాంగ్రెస్ పెద్దలు సిద్ధంగా వున్నారని ప్రచారం చేస్తున్నాడు డిఎల్.రవీంద్రరెడ్డి. జగన్ జైలుకు వెళ్తే ఆయన రాజకీయ భవిష్యత్తు బూడిద కావడంతో పాటు, ఆయన పార్టీ కూడా నిర్వీర్యమై పోతుందని భయపెడుతున్నాడు. ఒక స్థాయి వరకు నేతలు ఈ ప్రచారానికి లోబడుతున్నారు. తమకు చాలా మండలాలలో మనుషులు దొరకకుండా పోవడానికి డిఎల్ చేస్తున్న ప్రచారమే కారణమని జగన్ వర్గీయులు ఆందోళన చెందుతున్నారు.

చిరంజీవి అంతర్మథనం

ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చినట్లు, కడప ఉప ఎన్నిక ప్రజారాజ్యం మాజీ అధిపతి చిరంజీవికి సంకటంగా మారింది. ఈ ఎన్నిక కోసం ఒక్కొక్క నియోజకవర్గంలో ఒక్కొక్క రోజు లెక్కన వారం పాటు ప్రచారం చేయాలని ఆదేశించింది కాంగ్రెస్ అధిష్టానం. అయితే ఎవరో గెలుపు కోసం తానెందుకు అంత శ్రమ పడాలో అర్థం కావడం లేదు చిరంజీవికి. దాని వల్ల తనకేమి వస్తుందో అసలు బోధ పడడం లేదు. ఒకవేళ ఓటమి ఎదురైతే, తన ఇగో దెబ్బతినిపోతుందని బాధ. చిరంజీవి వస్తే జగన్ ప్రభావాన్ని రాష్ట్రమంతా నిలువరిస్తాడనే అంచనాతో ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించింది సోనియాగాంధీ. ఇప్పుడు ఈ ఎన్నికలలో తన ప్రభావం శూన్యమని తెలిపోతే, ముందు ముందు ఆమె నుంచి తాను కోరుకొంటున్న పదవులేవీ దక్కక పోవచ్చునని భయపడుతున్నాడు. లాంఛన ప్రాయంగా ఒకటి రెండు సభలలో మాట్లాడి సరిపెడతానని చెప్తే, డిఎల్.రవీంద్రరెడ్డి వినడం లేదు. వారం పర్యటన తప్పదంటున్నాడు. పాపం చిరంజీవి పరిస్థితి చూస్తే జాలేస్తున్నది.

టిఎస్ఆర్, టీవీ9 సినీఅవార్డులు

9వ పేజీ కొరవ

వాంఛ. అందుకు తగిన స్థాయిలో వీటిని నిర్వహించాలన్నది తలంపు అన్నారాయన. కళాకారుల కోసం వేదిక మీద నుంచే గంభీర స్వరంతో ఈశ్వరార్చన చేశాడు. మంత్రాలను అనర్గళంగా ఉచ్చరించాడు.

డబ్బున్న వారంతా సుబ్బరామరెడ్డి వలె కళా సేవ చేయలేరని కితాబు ఇచ్చాడు అక్కినేని నాగేశ్వరరావు. ఆయన్ను ఫ్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డుతో సత్కరించారు. కళే జీవితమనుకొనే తమ జీవితాలను ధార పోస్తున్న కళాకారులకు ఇటువంటి ప్రోత్సాహకాలు ఎంతో మనో నిబ్బరాన్ని కల్గిస్తాయన్నాడు బాలకృష్ణ. ఆయనకు ఉత్తమ నటుడి అవార్డు దక్కింది. ప్రియమణి ఉత్తమ నటి అవార్డు సంపాదించింది. రామానాయుడుకు స్టార్ ప్రొడ్యూసర్ అవార్డు ఇచ్చారు. కృష్ణంరాజు రెబల్ హీరో అవార్డు అందుకొన్నారు. ఎవర్‌గ్రీన్ హీరో అవార్డు ధర్మేంద్రకు ఇచ్చారు. శత్రుఘ్నసిన్హాను డైనమిక్ స్టార్‌గా నిర్ణయించారు.

ఎప్పుడూ సంతోషంగా వుండడం సుబ్బరామరెడ్డి గారికి దేముడిచ్చిన వరమన్నాడు చిరంజీవి. హిందీ సీమలో నా ప్రాభవానికి సుబ్బరామరెడ్డి గారే అండా దండా ఇచ్చారని గొప్పగా చెప్పింది జయప్రద.

మొత్తం మీద టిఎస్ఆర్ అవార్డుల ఉత్సవం హైదరాబాదులో జరిగే కళా సంబంధిత కార్యక్రమాలన్నిటికీ తలమానికంగా విరాజిల్లింది. ఈ సందర్భంగా నిర్వహించిన నృత్య కార్యక్రమాలు చూడాల్సిందే కానీ, మాటలతో చెప్పేవి కావు.

జనవాణి

2వ పేజీ కొరవ


వగా చూడకూడదు. తక్కువగా చూడాల్సిన అవసరం లేదు. మగవారితో సమానంగా చూడడమే న్యాయం, ధర్మం. ఆశ మహిళలు పోలీసులను గలీజుగా తిట్టారు; వాళ్లూ మనుషులే. శాంతిభద్రతలను కాపాడాలని వచ్చిన వారి పని భంగపరచి లాఠీఛార్జీ వరకు తీసుకవచ్చిన ఆ మహిళలను నెత్తిన పెట్టుకొని పనీపాట లేని తమ ఉనికిని చాటుకోవాలనే ఆ మహిళా సంఘాలు పెట్టేగోల చూస్తే జుగుప్స కలుగుతుంది.

తూపిలి వనమాలి నెల్లూరు

కడప ఉప ఎన్నిక సర్వే ఫలితాలు ప్రచురించండి!

నేను చాలా రోజులుగా 'జమీన్‌రైతు' పాఠకుడిని. రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు డి.శ్రీనివాస్, కె.కేశవరావు, మంత్రులు శంకరరావు, డిఎల్.రవీంద్రారెడ్డి వ్యవహరిస్తున్న తీరు వల్ల పార్టీ భ్రష్టు పట్టింది. తెలుగుదేశం పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఎన్నో ఎన్నికల్లో ఖచ్చితమైన సర్వేలు చేసి ప్రచురించే 'జమీన్‌రైతు' కడప ఉప ఎన్నికల మీద కూడా సర్వేచేసి ముందుగా ఫలితాలు ప్రకటించ మనవి.

ఓ పాఠకుడు నెల్లూరు



నెల్లూరు వేదాయపాళెంలోని లిల్లి లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో జరిగిన శ్రీనివాస కళ్యాణ మహోత్సవంలో ఇసి.నారాయణరెడ్డి దంపతులతోపాటు టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ సభ్యుడు వాకాటి విజయకుమార్‌రెడ్డి,

నెల్లూరు ముచ్చట్లు

3వ పేజీ కొరవ

గిందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. 11వ తేది పార్టీ కార్యాలయంలో జరిగిన జ్యోతిరావు పూలే 185వ వర్ధంతి సభలో మాట్లాడారు. జిల్లాలో లక్షల ఎకరాల భూములను నామమాత్రపు ధరకు పారిశ్రామికవేత్తలకు కట్టబెడ్డటం కెవిపి రామచంద్రరావు, జిల్లాలోని అధికార పార్టీ నేతలతోపాటు జిల్లా కలెక్టర్ రాంగోపాల్ హస్తముందన్నారు. ఎక్కడాలేని విధంగా ఎస్సీ, ఎస్టీ, బిసి వర్గాల రైతుల భూములే సెజ్‌లు, ధర్మల్ స్టేషన్ల పేరిట లాక్కోవడం దారుణమన్నారు.

పోలీసుల అదుపులో మావోయిస్టులు!

మావోయిస్టు పార్టీ సభ్యులు ఝాన్సీ, పద్మాకర్, సుధాకర్‌లు వైద్య చికిత్స కోసం చెన్నై వెళ్తుండగా నాయుడుపేటలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అదుపులో తీసుకొన్నారని, వీరిని తక్షణం కోర్టులో హాజరు పర్చాలని ఆ పార్టీ ప్రతినిధి ఆనంద్ 9వ తేది పత్రికా కార్యాలయాలకు ఒక ప్రకటన పంపారు.

శ్రీనివాసుని కళ్యాణం

నెల్లూరు వేదాయపాళెంలోని లిల్లీ లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో టిటిడి, హిందూ ధర్మ ప్రచార పరిషత్ నేతృత్వంలో శ్రీనివాస కళ్యాణ మహోత్సవం 10వ తేది ఘనంగా జరిగింది. పుష్పాలంకరణ శోభితుడైన శ్రీనివాసుడు శ్రీదేవి, భూదేవిలను పరిణయమాడి జనులను ఆనంద పారవశ్యులను చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి ధార్మిక సలహా మండలి సభ్యులు వాకాటి విజయకుమార్‌రెడ్డి, వీరిశెట్టి సుధాకర్, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

ప్రైవేట్ వైద్యంపై ఉద్యమం

ప్రైవేట్ వైద్యులు వైద్యం పేరుతో చేస్తున్న దోపిడీని అరికట్టాలని కోరుతూ పౌరహక్కుల సంఘం ఉద్యమిస్తున్న సంగతి తెలిసిందే. దీనిలో భాగంగా నగరంలో వారం రోజులుగా వారు సంతకాల సేకరణ ఉద్యమం చేపట్టారు. కొందరు వైద్యులు చేస్తున్న దోపిడీని ప్రజల్లో చైతన్యం కల్గించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం తక్షణం నియంత్రణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

24న మోడల్ ఎంసెట్

ఏప్రెల్ 24న మోడల్ ఎంసెట్‌ను నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి చంద్రమోహన్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ మోడల్ ఎంసెట్ చేపడుతున్నామన్నారు. ఇంజనీరింగ్, మెడికల్ విభాగాల్లో విద్యార్థుల భయాన్ని పోగొట్టి వారికి అవగాహన కల్పించడమే ఈ పరీక్ష ఉద్దేశమన్నారు. రెండు విభాగాల్లో మొదటి మూడు స్థానాలను సాధించిన విద్యార్థులకు గోల్డ్‌మెడల్, పది మందికి 40వేల రూపాయల వంతున నగదు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

పోలీసు సిబ్బందిపై ఎస్పీ ఆగ్రహం

నగరంలో పోలీసుల పనితీరుపై ఎస్పీ దామోదర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వరుస దొంగతనాలు, దోపిడీలు జరగడంపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. సిఐ, ఎస్ఐలు సక్రమంగా సిబ్బంది పనితీరును పరిశీలించడం లేదన్నారు. నైట్‌బీట్ సిబ్బంది సినిమా హాళ్లలో కాలక్షేపం చేస్తున్న సంగతి తనకు తెలుసునని, మీ వల్ల కాకపోతే నేనే రంగంలోకి దిగుతానని ఝులక్ ఇచ్చారు. నగర డిఎస్పీ సమావేశానికి రాకపోవడంపై ఉన్నతాధికారులకు ఆయన ఫిర్యాదు చేశారు.

పొణకా కనకమ్మ జీవిత చరిత్ర ఆవిష్కరణ!

జిల్లాలో తొలితరం స్వాతంత్ర్య యోధురాలు, మహిళాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన సాధ్వీమణి పొణకా కనకమ్మ జీవిత చరిత్ర 'కనక పుష్యరాగం' పుస్తకావిష్కరణ సభ 17వ తేది సాయంత్రం మురళీకృష్ణ హోటల్ కాన్ఫరెన్స్ హాలులో జరుగుతుంది. ఈ పుస్తకాన్ని స్వాతంత్ర్య సమరయోధుడు ఆర్.దేవదానం ఆవిష్కరిస్తారు. డాక్టర్ వెలగా వెంకటసుబ్బయ్య సమీక్షిస్తారు. నెల్లూరీయులను ఈ కార్యక్రమానికి తరలి రమ్మంటున్నారు రచయిత డాక్టర్ కాళిదాసు పురుషోత్తం.

ఐదు వందల రూపాయలకు పాట వ్రాసిన ఆత్రేయ!

నాకు తెలిసిన ఆత్రేయ

జయంపు కృష్ణ

మనసు కవి ఆత్రేయది నెల్లూరుజిల్లా సూళ్ళూరుపేట దగ్గరున్న మంగళం పాడు గ్రామం అని అందరికీ తెలుసు. ఆయన పేరు కిళాంబి నరసింహాచార్యులని కూడా తెలుసు. అయితే ఆయన కొంతకాలం వెంకటగిరిలో నివాసమున్నాడు. అక్కడే ఆయన ఆత్రేయ అనే కలం పేరుతో నాటకాలు రాయసాగాడు. స్థానికంగా "అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్"(AAA) అనే నాటక సంఘం ఏర్పరచి వారి ద్వారా ఆయన నాటకాల ప్రదర్శన సాగించే వాడు.


అక్కడ ఆయన దగ్గరి మిత్రుడు, ప్రముఖ నటుడు డాక్టర్ కె.సి.శేఖర్. వీరిద్దరూ కలసి నాటకాల మీద చర్చించుకుంటూ వుండేవారు. ఆత్రేయ చార్మినార్ సిగరెట్టు పట్టుకొని, అందులోని సిగరెట్లను బ్లేడుతో చక్కగా రెండు ముక్కలుగా కట్‌చేసి, దాచుకొనేవాడు. ఆయన, శేఖర్ టీ కొట్టులో ఒన్‌బైటు టీతాగి, కట్‌చేసిన ఒక సిగరెట్టులో చెరొక ముక్క షేర్ చేసుకునే వారు. అలా గడిచింది వెంకటగిరిలో ఆత్రేయ జీవితం. ఇదంతా ఆతర్వాత కాలంలో నాటకాలలో నాకు గురువైన డాక్టర్ కె.సి.శేఖర్ ద్వారా తెలుసుకున్నాను.

అలా నాటకాలలో ప్రసిద్ధుడైన ఆత్రేయ సినీ ప్రస్థానం జరిగింది. శేఖర్ 'బాలనాగమ్మ' నాటకంలో జగమెరిగిన మాయలఫకీరుగా రాణించాడు. చాలా కాలానికి ఆత్రేయ ప్రేమనగర్ సినిమాకి రచనచేసే సమయంలో శేఖర్ ఆయన వద్దకు వెళ్లి ఆ వర్క్‌లో పాలు పంచుకోవడం జరిగింది. అప్పట్లో ఆత్రేయ దగ్గర ఒక అల్సేషియన్ డాగ్ వుండేదట. దానికి కేర్ టేకర్ ఒకడు వుండేవాడట. దాని మెయింటెనెన్స్ అంతా చూసిన శేఖర్ " మీ కుక్కకు ఒక్క రోజు అయ్యే ఖర్చుతో ఓ సామాన్యుడు నెల రోజులు బ్రతకొచ్చు" అన్నాడట. అందుకు ఆత్రేయ స్పందిస్తూ వెంకటగిరిలో తనువున్నప్పటి స్థితి తలపోసుకుంటూ తన చేతిలో వున్న పెన్నును చూపిస్తూ "ఇవన్నీ శాశ్వతం కాదు శేఖర్! ఇదిగో నా చేతిలోని పెన్ను – ఇది ఆనాడూ వుంది. ఈనాడు వుంది. నేను చచ్చేవరకు నాతోనే వుంటుంది. ఇదే నాకు శాశ్వతమైన ఆస్తి" అన్నాడట నవ్వుతూ.

మరో విశేషం

ఆత్రేయ లెటర్‌హెడ్ మీద AA అని వుండేది. అంటే ఆచార్య ఆత్రేయ అని అర్థం. అయితే అది వెంకటగిరిలో ఒకప్పటి AAA (అమెచ్యూర్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్)కి సంక్షిప్తరూపంగా ఆయన భావించే వారట. అలా చిత్రసీమలో రాయక నిర్మాతల్ని ఏడిపించాడు. రాసి ప్రేక్షకుల్ని ఏడిపించాడు. అయినా నాటక రంగాన్ని ఆయన ఏనాడూ మరచిపోలేదు. సినిమారంగంలో ఒక్క వెలుగు వెలిగాడు. అన్ని అనుభవాలూ చవి చూశాడు.

నేను 1973 నుంచి సినిమా రంగంలో ఒక దశాబ్దం పనిచేయడం జరిగింది. ఆ దశకంలో అప్పుడప్పుడూ మా కౌముదీ పిక్చర్స్ ఆఫీసుకు ఆత్రేయ వస్తూ వుండేవాడు. అలా జరిగింది ఆయనతో నా పరిచయం. ఆయన ఐదు వందల రూపాయలు మా నిర్మాత ఎమ్మెస్‌రెడ్డి గారిని అడిగేవారు. పాట రాస్తా



నని. అదీ అప్పటి ఆయన దుస్థితి. అయితే జేబులో ఆయన పెన్ను మాత్రం తళతళలాడుతూ కనిపించేది. ఇదీ చిత్రజగత్తు – ఒక విచిత్ర మహత్తు – అనిపించింది నాకు.

• తూతూ మంత్రంగా

ఎస్సీ కమిషన్ పర్యటన!

నెల్లూరు నగరానికొచ్చిన జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ రెండు రోజుల పర్యటన తూతూ మంత్రంగా సాగింది. కమిషన్ సభ్యురాలు లతాప్రేమ్‌కుమార్, డైరక్టర్ చిత్రాఆర్మ్ గంలు ఈ నెల 7, 8 తేదీలలో నెల్లూరు నగరంలో బసచేసి ఎస్సీల అభివృద్ధి కోసం చేపడుతున్న పథకాలు, అట్రాసిటీ కేసులపై వివిధ శాఖలకు చెందిన అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలిరోజు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో దళిత సంఘాల నేతలతో సమావేశం నిర్వహించి, పలు సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించారు. రెండవ రోజు గోల్డెన్ జూబ్లీ హాలులో అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొన్నారు. రాజ్యాంగ బద్ధమైన ఈ కమిషన్ పర్యటన వల్ల జిల్లా ఎస్సీలకు ప్రయోజనం లేకుండా పోయింది. గతంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌తోపాటు సభ్యులు కూడా జిల్లా పర్యటనకు వచ్చి వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఎస్సీల సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషిచేసిన సందర్భాలున్నాయి. చాలా సంవత్సరాల తర్వాత జాతీయ ఎస్సీ కమిషన్‌కు చెందిన ఒక్క సభ్యురాలు జిల్లా పర్యటనకు రావడం, కేవలం అధికారులతో సమావేశానికి పరిమితం కావడం పట్ల దళిత సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. తొలిరోజు దళిత నేతల నుంచి స్వీకరించిన వినతులపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో చర్చిస్తారని అందరూ భావించారు. కానీ ఒక్క సమస్యపై కూడా అధికారులతో చర్చించిన దాఖలాలు కనిపించ లేదు. జిల్లా కలెక్టర్ అధికారులతో సమావేశం నిర్వహించి ఏవిధంగా సూచనలు, సలహాలు చేస్తారో అదేవిధంగా కమిషన్ సభ్యురాలు వ్యవహరించారు. చాలా సంవత్సరాల తర్వాత జాతీయ ఎస్సీ కమిషన్ జిల్లా పర్యటనకు రావడం పట్ల అట్రాసిటీ కేసులపై దృష్టి సారిస్తుందని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. జిల్లాలో ఇప్పటివరకు ఈ చట్టం కింద ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎంత మందికి కఠిన శిక్షలు పడ్డాయి? ఎన్ని కేసులు పెండింగ్‌లో వున్నాయి? బాధితులకు అందిస్తున్న ఆర్థిక సహాయం, తదితర అంశాలు అసలు చర్చకే రాలేదు. కమిషన్ జిల్లాకు ఎందుకొచ్చింది? ఏమి చేసి వెళ్లిందన్న అంశంపై చర్చించుకొంటున్నారు. దళితులపై అత్యాచారాలు, దాడులు నియంత్రించడంతోపాటు రాజ్యాంగం కల్పించిన హక్కులు కాపాడేందుకు ఏర్పాటుచేసిన ఎస్సీ కమిషన్ బాధ్యతగా వ్యవహరించడంలో విఫలం చెందింది.



జిల్లా పరిషత్‌లో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎస్సీ కమిషన్ సభ్యురాలు లతా ప్రేమ్‌కుమార్.

• అందుబాటులో లేని సాంకేతిక సిబ్బంది

బోసిపోతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు

గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నమూనాలను పరిశీలించే సాంకేతిక సిబ్బంది అందుబాటులో వుండడం లేదు. జిల్లాలోని 28 మండలాల్లో 33 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించే రైతులు ముందుగా నమూనాలను సాంకేతిక సిబ్బంది ద్వారా పరీక్షించుకోవాల్సి వుంటుంది. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు వెళ్లిన సమయంలో సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేకుండా పోతున్నారు. దీంతో రైతులు వారికోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి కలిగింది. వ్యవసాయశాఖ, పౌరసరఫరాల శాఖలు సంయుక్తంగా సాంకేతిక సిబ్బందిని నియమించినట్లు ప్రకటించి వున్నాయి. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని సాంకేతిక సిబ్బంది పరిశీలించి నాణ్యతా ప్రమాణాలను బట్టి ధర నిర్ణయించాల్సి వుంటుంది. కొన్ని కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది రైస్‌మిల్లర్లకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వున్నాయి. అధికారులు చెబుతున్న వివరాలకు, కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న తీరుకు ఏమాత్రం పొంతన వుండడం లేదు. ఇప్పటికే ధాన్యానికి గిట్టుబాటు ధర లభించక రైతులు ఇబ్బంది పడుతుంటే ధాన్యంలో నాణ్యతా ప్రమాణాలున్నప్పటికీ ఏదో ఒక కారణం చూపి తక్కువ ధరకు కొనుగోలు చేసేందుకు రైస్‌మిల్లర్లు ప్రయత్నిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.



నెల్లూరు పరమేశ్వరి కళ్యాణ మండపంలో జరిగిన కాకతీయ సేవాసమితి ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సమితి అధ్యక్షుడు రావిమోహన్‌చౌదరి. వేదికపై మాదాల తిమ్మయ్య, గోపాలకృష్ణయ్య చౌదరి, చేకూరి బాబురావు తదితరులున్నారు.

Regn.No. : RN 1156 / 57 J/Nellore/008/09-11

ఆదర్శవంతమైన విద్యాలయం
'అక్షర విద్యాలయ'

- బోధన ఆంగ్లమైనా భావన భారతీయం.
- వెంకటాచలంలో వికసించిన విద్యా కుసుమం.
- తరగతి గదులకే చదువు పరిమితం.
- పచ్చని పొలాల మధ్య 25ఎకరాల సువిశాల ప్రాంగణం.
- అపార అనుభవం గడించిన ఉపాధ్యాయ గణం.
- గౌరవ సలహాదారులుగా విఖ్యాత విద్యావేత్తలు.
- స్వర్ణభారత్ మానస పుత్రిక అక్షర విద్యాలయ.

విద్యా బోధనలో పేరెన్నికగన్న సింహపురిలో విద్యార్థులకు విలక్షణ విద్యనందించను వికసించిన విద్యా కుసుమం అక్షర విద్యాలయ. ఇంగ్లీషు ధారాళంగా మాట్లాడే విధంగా శిక్షణ ఇవ్వడంతోపాటు మన సంస్కృతి, సాంప్రదాయాలు, మన మూలాలు, భాష పరిరక్షణ అవసరం. సినిమా, టీవీల కారణంగా ప్రజా జీవనం ఎంతో వేగంగా మారిపోతున్నది. భారతీయతకు పట్టుకొమ్మయిన కుటుంబ వ్యవస్థ, సంస్కృతి, సంప్రదాయాలు మరుగున పడిపోతున్నాయి. పాశ్చాత్య వ్యామోహం పెరిగి క్రమేపి 'మమ్మీ – డాడి' సంస్కృతి వచ్చేస్తున్నది. పాశ్చాత్య దేశాలలో లాగా మనదేశంలో కూడా యువత మాదకద్రవ్యాలకు బానిసలు కావడం, క్రమబద్ధ జీవితాలకు అలవాటు పడకపోవడం, కుటుంబంలో ప్రేమ, అనురాగాలు కొరవడడంతో జీవనం యాంత్రికంగా తయారవుతున్నది. దాంతో వివాహాలు ఆదిలోనే విచ్ఛిన్నం కావడం జరుగుతున్నది. అందుకే విద్యాభ్యాస దశలోనే చిన్నారులకు సరైన పునాది వేసి, అవగాహనను పెంచి, ఆత్మ న్యూనతా భావాన్ని విడనాడేలా, ఆత్మగౌరవాన్ని పెంచి ఒక పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని తయారు చేసే చదువుని అందించాలనే ఉద్దేశ్యంతో నెల్లూరు జిల్లా, జాతీయ రహదారికి అనుకొని వెంకటాచలం మండలం సరస్వతి నగర్‌లో 'అక్షర విద్యాలయ' స్థాపించబడినది.



కేంద్ర మంత్రి పురంధేశ్వరి, కర్నాటక విద్యాశాఖ మంత్రి విశ్వేశ్వర హెగ్డే చేతుల మీదుగా ప్రారంభం.

విద్యాబోధనలో సరికొత్త ప్రయోగం!

బోధన ఆంగ్లం అయినా భావన భారతీయమే అనే ఆదర్శంతో ఒక క్రొత్త ప్రయోగాన్ని చేపట్టి, అంతర్జాతీయ ప్రమాణాలు పాటిస్తూ అధునాతన పద్ధతులు, విజ్ఞాన విశేషాలు, జాతీయ విలువలతో కూడిన విద్యను అందించడం, విద్యారంగంలో ఏర్పడిన పోటీతత్వాన్ని అలవోకగా తట్టుకుని నిలబడగలిగే నాణ్యమైన విద్యను అందించడంతోపాటు మానవీయ విలువలను జొప్పించి ప్రతి విద్యార్థిని ఒక సంస్కారవంతుడైన, బాధ్యతాయుతుడైన భారతీయ పౌరుడిగా తీర్చిదిద్దడం 'అక్షర విద్యాలయ' ముఖ్య ఉద్దేశ్యం. 'బడిలో చదువుకో–ఇంట్లో ఆడుకో' అనే విద్యా విధానం, చదువును తరగతి గదుల వరకే పరిమితం చేయాలి. ఇంట్లో మనో ఉల్లాసానికి, కుటుంబ బంధాలకు ప్రాధాన్యత ఇవ్వాలనేది 'అక్షర విద్యాలయ' ముఖ్య ఉద్దేశ్యం.

పచ్చని పొలాల మధ్య అక్షర విద్యాలయ

హార్వర్డ్ – కేంబ్రిడ్జి యూనివర్సిటీ పూర్వ విద్యార్థులచే ఏర్పాటు చేయబడిన iDISCOVERi సంస్థ భాగస్వామ్యం, X-seed Curriculum తో విద్యాబోధన, దానితోపాటు సంగీతం, సాహిత్యం, భారతీయ క్రీడల పట్ల అభిరుచి వీటన్నిటిని కలుపుతూ గ్రామీణ వాతావరణంలో, పచ్చని పొలాల మధ్య 25 ఎకరాల సువిశాల ప్రాంగణంలో 'అక్షర విద్యాలయ' నెలకొల్పబడినది. దక్షిణాదిలోనే ఎక్కడా లేని విధంగా 625 చదరపు అడుగుల వైశాల్యంతో 25 మంది విద్యార్థులకే పరిమితమైన తరగతి గదులు, పచ్చని పొలాల మధ్య నెలకొల్పిన ఇటువంటి విద్యా సంస్థ మరొకటి లేదు. విశాలమైన భవన సముదాయం, విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ చూపేందుకు 1:10 ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తి, వాతావరణ సమతుల్యానికి ఏర్పాటు చేయబడిన సంరక్షిత మంచినీటి చెరువు, ప్రాంగణం అంతటా పచ్చని చెట్ల పెంపకంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దబడింది.

చదువుతోపాటు ఆటా – పాటా!

భరతనాట్యం, శాస్త్రీయ సంగీతం నేర్పను ప్రత్యేక వసతి. శారీరక దృఢత్వానికి జిమ్, మానసిక వికాసానికి యోగ, గ్రామీణ ఆటలైన కబడీ, ఖొఖొతోపాటు స్కేటింగ్ రింక్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్, హాకీ, క్రికెట్ క్రీడలకై అన్ని వసతులు కల్పించబడ్డాయి. ఆడియో, వీడియోల ద్వారా ఆధునిక విజ్ఞానం, అధునాతన పరిజ్ఞానంతో బోధనకై కంప్యూటర్ ల్యాబ్, ఎన్.ఐ.ఐ.టి మ్యాథ్స్ మరియు సైన్స్ ల్యాబ్, రోబోటిక్స్, ఈ–లైబ్రరి తదితర వసతులు కల్పించబడ్డాయి. వీటితోపాటు విజ్ఞాన, విహారయాత్రలు చేపట్టబడుతున్నాయి.

ప్రాంగణంలోనే 40 మంది అధ్యాపకులు

విద్యార్థుల నిరంతర పర్యవేక్షణకై 40మందికిపైగా అధ్యాపకులు ప్రాంగణంలోనే నివాసం ఉండే విధంగా చక్కటి వసతి కల్పించబడినది. అనుభవజ్ఞులైన వంట వారిచే చిన్నారులు ఇష్టపడే రుచికరమైన, పోషకవిలువలతో కూడిన భోజనం, 1000 మందికి సరిపడే భోజనశాల (డైనింగ్‌హాల్) 4 నుంచి 8వ తరగతి వరకు అబ్బాయిలకు, అమ్మాయిలకు వేరుగా విశాలమైన రూములతో హాస్టల్ వసతి, చక్కని ఉద్యానవనం (Eco Park) సైన్స్ పార్క్, చిన్నారులకు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయబడి వుంది.

మందిరంలోనికి అడుగిడినట్లే!

విద్యాలయ ప్రాంగణంలోకి అడుగుపెట్టగానే బాసర సరస్వతి మందిరాన్ని తలపించే చదువుల తల్లి వాగ్దేవి మందిరం, దానికి ఆనుకొని వెంకటేశ్వరస్వామి ఆలయం, ముఖద్వారంలో స్వామి వివేకానంద నిలువెత్తు కాంస్య విగ్రహం కనువిందు గావిస్తాయి. మన సంస్కృతి, మన పూర్వీకులను గౌరవిస్తూ ప్రాంగణంలో మన దేశనాయకులు, ఆధ్యాత్మిక గురువులు ఛత్రపతి శివాజి, భక్త ప్రహ్లాద, రాణా ప్రతాప్, అల్లూరి సీతారామరాజు, శ్రీకృష్ణదేవరాయలు, ఝాన్సీ లక్ష్మీబాయిల పేర్లతో కూడిన భవనాలు, సంస్థానాలను విలీనం చేసిన 'ఉక్కుమనిషి' సర్దార్ పల్లభాయ్ పటేల్ పరిపాలన భవనం దర్శనమిస్తాయి.

అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు

వివిధ రాష్ట్రాలలో పనిచేసి అపార అనుభవం గడించిన ప్రిన్సిపాల్ నిరంతర పర్యవేక్షణ, ఉపాధ్యాయులకు iDISCOVERi వారిచే శిక్షణ, పునఃశ్చరణ తరగతులు తరచుగా నిర్వహించబడుతున్నాయి.



వెంకటాచలంలోని అక్షర విద్యాలయం.

ఆదర్శవంతమైన విద్యాలయం

దేశంలోనే ఒక ఆదర్శవంతమైన విద్యాలయంగా 'అక్షర విద్యాలయ'ను తీర్చిదిద్దాలనేది నిర్వాహకుల ఆకాంక్ష. బిజెపి సీనియర్ నాయకులు ముప్పవరపు వెంకయ్యనాయుడు గారి స్వస్థలంలో ఏర్పాటు చేయబడిన ఈ విద్యాలయం వెనుక ఆయన ప్రేరణ ఎంతో ఉన్నది. దేశంలోనే పేరెన్నికగన్న విద్యాలయాలను నిర్వహిస్తున్న విద్యావేత్తలు 'అక్షర విద్యాలయ'లో సలహాదారులుగా ఉన్నారు.

బెంగుళూరుకి చెందిన ప్రఖ్యాత విద్యాసంస్థ నేషనల్ పబ్లిక్ స్కూల్ అధినేత శ్రీ గోపాలకృష్ణ, పి.ఇ.యస్. విద్యాసంస్థల అధినేత శ్రీ దొర స్వామి నాయుడు, విజ్ఞాన్ యూనివర్శిటీ అధినేత శ్రీ లావు రత్తయ్య, చెన్నైకి చెందిన ప్రముఖ విద్యాసంస్థ ఆర్.ఎం.కె. అధినేత శ్రీ మునిరత్నం, భీమవరం, హైదరాబాదులలో ఎన్నో ఆదర్శవంతమైన విద్యాసంస్థలను నడుపుతున్న శ్రీ విష్ణురాజు, దాదాపు నలభైవేలమందికి పైగా విద్యార్థులున్న పూణె ఎం.ఐ.టి. విద్యాసంస్థ అధినేత రాహుల్ కరాడ్, ఢిల్లీలోని 'సంస్కార్' అంతర్జాతీయ విద్యాలయం అధినేత నలీన్ కొహ్లి, ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజి విభాగం అధ్యాపకులు డాక్టర్ అట్లూరి



ఆధునిక తరగతి గదిలో అధునాతన బోధన.

అశోక్ తదితరులు తరచూ విద్యాలయ ప్రమాణాలను పెంపొందించేందుకు సంబంధించిన సలహాలు అందజేస్తూవుంటాయి.

గత పదేళ్లుగా స్వచ్ఛంద సేవారంగంలో విశిష్ట సేవలందిస్తున్న స్వర్ణభారత్ ట్రస్ట్ 'అక్షర విద్యాలయ'ను నిర్వహిస్తున్నది. కేంద్రమంత్రి శ్రీమతి దగ్గుబాటి పురంధేశ్వరి గారిచే గత సంవత్సరం ప్రారంభించబడి సాంప్రదాయాలు, విలువలకు కట్టుబడి నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ముందుకెళుతున్న 'అక్షర విద్యాలయ' ఈ సంవత్సరం 1 నుండి 8 తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల ప్రవేశాన్ని ప్రారంభించినది. 600 మందికి హాస్టల్ వసతి, అన్ని వసతి సౌకర్యాలు కల్పిస్తూ అందరికి అందుబాటులో వుండే విధంగా ఫీజు 26వేలు మాత్రమే నిర్ణయించడం జరిగినది. విద్యాలయాన్ని ఒకసారి సందర్శించి తల్లిదండ్రులు తగిన నిర్ణయం తీసుకొంటే మంచిది.

Edited, Printed and Published by N. Dolendra Prasad. Ph: 091-861-2327354, Offset Printing at Zaminryot Press, Nellore.